


# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

ఈ స్థలం [22 సెంట్లు]
అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు
కె. అబెద్నేగో(రాజు బాబు) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243
RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 140 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 11 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఇవ్వండి..

### సీఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** విశ్రాంత ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించకుండా మానసిక వేదనకు గురి చేయడం న్యాయమా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. పదవీ విరమణ చేసి రెండేళ్లయినా బెనిఫిట్స్ బకాయిలను మిగతా .. 2లో..

## వాన్‌పిక్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

### సీబీఐ నమోదు చేసిన కేసును డిస్మిస్ చేసిన న్యాయస్థానం



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** వాన్‌పిక్ ప్రాజెక్ట్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలన్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ నమోదు మిగతా .. 2లో..

## 17న భారత్‌కు

### ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ రాక



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత్ పర్యటనకు రానున్నారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు ఆయన దేశంలో పర్యటిస్తారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా ఇరుదేశాల మధ్య కుదిరిన 25 ఏళ్ల వ్యూహాత్మక రోడ్ మ్యాప్ మిగతా .. 2లో..

తిరుమల చేరుకున్న బండ్ల గణేశ్

## సంకల్ప యాత్ర



**తిరుమల, విశ్వంవాయిస్ న్యూస్ :** సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ సంకల్ప యాత్ర తిరుమలకు చేరుకుంది. వైకాపా హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబు అరెస్టైన సమయంలో మొక్కు కున్న మొక్కును తీర్చుకునేందుకు ఆయన పాదయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. షాద్‌నగర్ నుంచి ఆయన తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ మాట్లాడుతూ "23 రోజులు అడ్డంకులు లేకుండా 537 కిలోమీటర్ల మేర సంకల్ప యాత్ర చేసి శ్రీవారి సన్నిధికి చేరుకున్నా. శ్రీవేం కటేశ్వరుడిని నమ్ముకొని నష్టపోయినవారు లేరు. నిజాయతీగా కోరుకున్నా.. నా మొర ఆలకించారు. నా జన్మలో ఇది గొప్ప ఘట్టం. ఈ జన్మంతా శ్రీవారికి సేవ చేస్తాను" అని తెలిపారు.

దేశ వ్యవసాయం రంగలో

# ఏపీ వాటా 10%

### కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ వ్యవసాయ రంగంలో ఏపీ వాటా 10 శాతం ఉందని గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. పీఎం ప్రాణమ్ పథకం కింద ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్‌ను విస్తరించడానికి నిధులు విడుదల చేయా లని కోరారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించడం



వల్ల అందించే ప్రోత్సాహకా లను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.216 కోట్లు ఇవ్వాలని కోరారు. 2024-25లో సాగులో రసాయనాల వినియోగం 2.28 శాతం మేర తగ్గించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్నామని.. ఇప్పటి వరకు 18 లక్షల మంది రైతులు 8 లక్షల హెక్టార్లలో సేంద్రియ సాగుకు మొగ్గు చూపుతూ సమ్మతి తెలిపారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి సాగు మిగతా .. 2లో..

వైకాపా ఎమ్మెల్యేల గైర్హాజరు నేపథ్యంలో

## స్పీకర్ కీలక నిర్ణయం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వైకాపా ఎమ్మెల్యేల వరుస గైర్హాజరు నేపథ్యంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎల్లుండి నుంచి డిజిటల్ విధానంలోనే ఎమ్మెల్యేల హాజరు తీసుకోవాలని నిర్ణయించారు. సభకు హాజరు కాని సభ్యులు జీతాలు తీసుకోవడం, ఎమ్మెల్యేలుగా కొనసాగడం సబబా? అని వివిధ సందర్భాల్లో స్పీకర్ అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనకున్న విచక్షణాధికారాలతో ఎమ్మెల్యేల హాజరుపై కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలకు సంబంధించి ఇప్పటి వరకు వైకాపాకు చెందిన 11 మంది ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగానికి హాజరుకావడం తప్ప.. శాసనసభ సమావేశాల్లో పాల్గొనడం లేదు. వరుసగా 60 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరైతే.. ఆ సభ్యుడిపై అనర్హత వేటు మిగతా .. 2లో..

విశాఖ మెట్రోకు

## కేంద్రం గ్రీన్‌సిగ్నల్

**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖ పట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దిల్లీ పర్యటనలో సీఎం చంద్రబాబుకు కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ స్వయంగా ఈ విషయాన్ని చెప్పారు. విశాఖ, విజయవాడలో మెట్రో రైలు ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో విశాఖ మెట్రోకు పచ్చజెండా ఊపి నట్లు సీఎంకు కేంద్రమంత్రి తెలిపారు.

డిప్యూటీ సీఎం పవన్‌ను కదిలించిన

## చిన్నారుల దయనీయ పరిస్థితి




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తల్లిదండ్రులు లేరని.. తమను ఆదుకోవాలని ఇద్దరు చిన్నారులు చేసిన విజ్ఞప్తి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కదిలించింది. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మాధవపురం గ్రామానికి చెందిన సత్య, చంటి.. రెండేళ్ల క్రితం తండ్రిని, ఇటీవల తల్లిని కోల్పోయారు. ఉండటానికి ఇల్లు కూడా లేక ఇబ్బందిపడుతున్నామని.. తమను ఆదుకోవాలని పవన్‌కు సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు. వీడియో ద్వారా చిన్నారుల వేదన తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించారు. ఇద్దరు చిన్నారులకు ప్రతి నెలా రూ.5 వేల చొప్పున రూ. 10 వేలు అందించాలని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ఏ ఆధారం మిగతా .. 2లో..

రూ.67 లక్షల పైచిలుకు

## స్వాధీనం..

### ముగ్గురి అరెస్టు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కొద్ది గంటల్లో ప్రారంభం కానున్న వేళ.. నగరంలో భారీ మొత్తంలో అక్రమంగా తరలిస్తున్న నగదును గోషామహల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గోషామహల్ జ్ఞాన్‌బాగ్ కాలనీకి చెందిన జ్యోతారామ్ (31), గణపత్‌రామ్ (30), మహేందర్ (32)లు కొంతకాలంగా మిగతా .. 2లో..

ఆ బిడ్డల సామాజిక సృహకు, నైపుణ్యానికి

## 'వావ్' అనాల్సిందే..

### బీసీ గురుకులాల్లో బీసీ సంక్షేమ శాఖ వినూత్న కార్యక్రమం
### వ్యర్థాల నుంచి సంపద సృష్టిపై విద్యార్థులకు ప్రోత్సాహం
### పర్యావరణ పరిరక్షకులుగా బీసీ బిడ్డలు : మంత్రి సవిత



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** చదువులోనూ, క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ చూపుతూ, పర్యావరణ పరిరక్షణలోనూ మేము సైతమంటూ భాగస్వాములవ్వడమే కాకుండా ఇంటి ముందు, ఇంటి లోపల వాడి పారేసిన ప్లాస్టిక్, పాత ఇనుము, కలప, వస్త్రాలతో పునర్వినియోగ వస్తువులను తయారు చేసి మిగతా .. 2లో..

మున్సిపల్ ఎన్నికలకు

## పకడ్బందీ ఏర్పాట్లు

### డీజీపీ శివధర్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని చెప్పారు. ఇతర శాఖల నుంచి మూడు వేల అదనపు బలగాలను మిగతా .. 2లో..

ప్రజా ప్రతినిధులకు మూడు రోజుల పాటు

## క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు

### అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అసెంబ్లీ సమావేశాల్లో ఆటవిడుపుగా ప్రజాప్రతినిధులకు క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. ప్రజా ప్రతినిధులకు క్రీడాపోటీల నిర్వహణపై సన్నద్ధతపై మంగళవారం స్పీకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మార్చి 5,6,7 తేదీల్లో క్రీడాపోటీలు, మిగతా .. 2లో..

## ఏపీలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ తీపి కబురు అందించారు. రూ.1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బకాయిలు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## పుస్తకం అందుబాటులో ఉందని నరవణె పోస్ట్

### కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత సైన్య మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం ఇటీవల దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రాసిన పుస్తకం సామాజిక మాధ్యమాల్లో అందుబాటులో ఉందంటూ నరవణె 2023లో పోస్ట్ చేశారని వెల్లడించారు. తన పుస్తకం సోషల్ మీడియాలో ఉందంటూ నరవణె 2023 డిసెంబర్‌లో ఎక్స్ (అప్పుడు ట్విట్టర్) వేదికగా లింక్ పోస్ట్ చేశారని రాహుల్ పేర్కొన్నారు. ఆ లింక్‌ను ఫాలో అవ్వగా.. ఓ ఆన్‌లైన్ స్టోర్‌లో పుస్తకం లభించిందన్నారు. తాను నరవణెనే నమ్ముతున్నానని మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఇవ్వండి..

చెల్లించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. "జీవిత మలి సంధ్యలో ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వమే మానసిక వేదనకు గురిచేస్తుండటం క్షమించరానిది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు తనువు చాలించారు. ఉద్యోగులను ప్రాధాన్యం లేని కేటగిరీగా భావిస్తున్నారా? మీకు మానవత్వం ఉందా? ఉద్యోగ విరమణ చేసిన వెంటనే బెనిఫిట్స్ అన్నీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? తక్షణమే వారి బకాయిలన్నీ చెల్లించాలి. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతాం. ప్రభుత్వం దిగొచ్చే వరకు హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష చేసేందుకూ వెనుకాడబోం" అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## వాన్‌పిక్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

చేసిన అభియోగాలను సీబీఐ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుందని.. దానికి గల కారణాలు చెప్పలేదంటూ వాన్‌పిక్ యాజమాన్యం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేయడంతో వాన్‌పిక్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై జస్టిస్ సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీనిపై విచారణకు నిరాకరిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

## 17న భారత్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ రాక

'హారిజన్- 2047'లో భాగంగా విస్తృత చర్చలు జరపనున్నట్లు తెలిపింది. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించనున్నట్లు పేర్కొంది. ముంబయిలో జరిగే ఇండియా- ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నేతలిద్దరూ ప్రారంభించనున్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, పరిశోధన వంటి అంశాల్లో పరస్పర సహకారానికి సంబంధించి ఏడాది పొడవునా ఈ కార్యక్రమం కొనసాగనుంది. దీంతో పాటు ఫిబ్రవరి 19న దిల్లీ వేదికగా జరిగే ఏఐ సమ్మిట్‌లో మేక్రాన్ పాల్గొనున్నారు.

## ఏపీ వాటా 10%

అభివృద్ధి చేయడానికి రూ.200 కోట్ల మేర సాయం చేయాలని కోరారు. కోకోనట్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు, కర్ణాటక తరహాలో మోడ్రన్ టెండర్ కోకోనట్ మార్కెట్ల ఏర్పాటు, కొబ్బరి రైతులకు అధునాతన పద్ధతులపై శిక్షణ, నర్సరీల విస్తరణకు సహకరించా లని విజ్ఞప్తి చేశారు. ఏపీలో మఖానా డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కొల్లేరు సరస్సు ప్రాంతంలో 50వేల ఎకరాల్లో మఖానా సాగుకు అనుకూల వాతావరణం ఉందని, అవసరమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ హార్టికల్చర్ హబ్‌గా మారుతోందని ఈ సందర్భంగా కేంద్రమంత్రి అన్నారు. రాష్ట్రంలో జీడిపప్పు, కాఫీ, కోకో, కొబ్బరి ఎక్కువగా పండుతోందని, రైతులకు మద్దతు ధర దక్కేలా చూస్తామన్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఏపీ పాత్ర కీలకమన్నారు. ఏపీ వ్యవసాయాభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇందు కోసం కేంద్రం ప్రత్యేక బృందాన్ని నియమించిందని చెప్పారు. కేంద్ర పథకాలు, సాంకేతికత విషయంలో ఏపీకి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మత్స్యరంగం, పశుపోషణ అభివృద్ధికి సాయం చేస్తున్నట్టు చెప్పారు. సేంద్రియ సాగు, పామాయిల్ ఉత్పత్తిలో ఏపీ బాగా పనిచేస్తోందన్నారు. సేంద్రియ సాగు విస్తరణకు అన్ని విధాలుగా సాయం చేస్తామని తెలిపారు.

### డిప్యూటీ సీఎం పవన్‌ను కదిలించిన

## చిన్నారుల దయనీయ పరిస్థితి

లేని వారికి తక్షణం ఇల్లు కట్టించి ఇచ్చే ఏర్పాటు చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఇద్దరు చిన్నారులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించాలన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో 42మంది అనాథ పిల్లలకు పవన్ కల్యాణ్ వేతనం నుంచి ఒక్కొక్కరికి ప్రతి నెలా రూ.5వేల చొప్పున అందిస్తున్నారు. తాజాగా మరో ఇద్దరు చిన్నారుల బాధ్యతను స్వీకరించారు. ఇటీవలే నెల్లూరు జిల్లాకు చెందిన స్కూల్ పిల్లలు రోడ్డు కావాలని వీడియో పోస్ట్ చేయగా.. డిప్యూటీ సీఎం స్పందించి రోడ్డు మంజూరు చేసిన విషయం తెలిసిందే.

## రూ.67 లక్షల పైచిలుకు స్వాధీనం..

ముఠాగా ఏర్పడి నగదు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. బేగంబజార్‌కు చెందిన కపిలేష్ సూచన మేరకు నిందితులు అఫ్జల్‌గంజ్‌లో ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.67 లక్షల పైచిలుకు నగదు తీసుకుని ముఠాలోని సభ్యులకు అప్పగించేందుకు వెళ్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు నిందితుల స్థావరంపై దాడిచేసి వారిని అరెస్టు చేశారు. నగదును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నగదుతో పాటు నిందితులను ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

### వైకాపా ఎమ్మెల్యేల గైర్హాజరు నేపథ్యంలో

## స్పీకర్ కీలక నిర్ణయం

వేయవచ్చని చట్టంలో ఉందని శాసనసభ వ్యవహారాలశాఖ అధికారులు చెబుతున్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో సభకు వచ్చినంత మాత్రాన సమావేశాలకు హాజరైనట్టు పరిగణనలోకి తీసుకోరని తెలుస్తోంది. దీనిపై చర్చ జరుగుతున్న సమయంలో.. గత పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, దొంగ చాటుగా సంతకాలు చేసి వెళ్లిపోకుండా డిజిటల్ హాజరు ప్రవేశ పెట్టాలని స్పీకర్ నిర్ణయించారు. రేపటి గవర్నర్ ప్రసంగం అసెంబ్లీ సమావేశాల్లో కౌంట్ కాదనేది ప్రభుత్వ వర్గాల వాదన. గవర్నర్ ప్రసంగం తర్వాత జరిగే బీఏసీ సమావేశంలో సభ ఎన్నిరోజులు నిర్వహించాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. వైకాపాకు చెందిన ఎమ్మెల్యేలు ఇప్పటి వరకు బీఏసీ సమావేశానికి హాజరైన సందర్భాలు లేవు.

**గవర్నర్‌తో స్పీకర్ భేటీ..**

రేపటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నందున గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి అసెంబ్లీ సమావేశాలకు ఆహ్వానించారు. సమావేశాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆయనకు వివరించారు. బుధవారం ఉదయం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు.

### ఆ బిడ్డల సామాజిక స్పృహకు, నైపుణ్యానికి

## 'వావ్' అనాల్సిందే..

వావ్ అని అనిపించుకుంటున్నారు బీసీ గురుకుల విద్యార్థులు. విద్యార్థులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులను చేయడంతో పాటు వారిలో సృజనాత్మకతను వెలికితీసే వినూత్న కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ శ్రీకారం చుట్టింది. మహాత్మా జ్యోతి రావు పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో లభ్యమయ్యే వ్యర్థాలతో కళాకృతులను విద్యార్థులతో తయారు చేసేలా వ్యర్థాల నుంచి సంపద (ఔముశ్రీష్ట్ర ాబ్ శీట ఔషఁర్వ - ఔూఔ) కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యర్థాలతో కళాకృతులు, పునర్వినియోగించు కునేలా వస్తువుల తయారీని ప్రోత్సహిస్తోంది. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన, ఐక్యత, జట్టు స్ఫూర్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా వావ్ కార్యక్రమాన్ని రూపొందించింది. రాష్ట్ర వ్యాప్తంగా 109 మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. బోధనలో, పరీక్షా ఫలితాల్లో బీసీ గురుకులాలు రాష్ట్రంలోని మిగిలిన ప్రభుత్వ విద్యా సంస్థల్లో కంటే అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నాయి. క్రీడల్లోనూ బీసీ గురుకుల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. యోగాలో కూడా బీసీ గురుకుల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై సామాజిక స్పృహ కలిగించడమే కాకుండా వారి సృజనాత్మకతను వెలికితీయాలని బీసీ సంక్షేమ శాఖాధికారులు నిర్ణయించారు. అదే సమయంలో గురుకుల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా వ్యర్థాల నుంచి సంపదను వెలికితీసే (వావ్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గురుకుల పాఠశాలల్లో ఉండే చిక్కీల రేపర్లు, ప్లాస్టిక్, పాత ఇనుము, కలపతో వివిధ రకాల కళాకృతులు, నిచ్చెనలు, కబోర్డులు, బ్యాగ్ లు, ఎండిన పువ్వుల రెక్కలతో ధూప్ స్టిక్స్, పాత దుస్తులతో ఫ్లోర్ మ్యాట్స్ వంటి వస్తువులను తయారు చేస్తున్నారు.

**ఒక్కో స్కూల్ ఒక్కో ప్రాడెక్ట్**

వావ్ కార్యక్రమంలో భాగంగా వ్యర్థాలతో చేసిన వస్తువులు ఆకర్షణీయంగా ఉండడమే కాకుండా పునర్వినియోగించేలా విద్యార్థులు తయారు చేస్తున్నారు. ఇలా ఒక్కో గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రత్యేకమైన వస్తువులు రూపొందించారు. ఎంజేపీ సింహాచలం పాఠశాల విద్యార్థులు ఎగ్ ట్రేస్, పాత బట్టలతో స్టడీ టేబుల్, కుర్చీలు తయారు చేశారు. పెనుకొండ ఎంజేపీ విద్యార్థులు ప్లాస్టిక్ బాటిళ్లు, మెటీరియల్ తో బర్డ్ ఫీడర్, పెద్దాపురం విద్యార్థులు కొబ్బరి వ్యర్థాలతో పెన్ స్టాండ్, కారాడ విద్యార్థులు చిక్కీ రేపర్లతో బ్యాగ్ లు, బాస్కెట్లు, కొత్తవలస విద్యార్థులు ప్లాస్టిక్ బాటిళ్లతో స్వాన్ మోడల్ గార్డెన్, లేపాక్షి విద్యార్థులు ప్లాస్టిక్, ఎలక్ట్రిక్ మెటీరియల్ తో షాండేలియర్ మోడల్ వంటి పునర్వినియోగ వస్తువులు రూపొందించారు.

**ఆకట్టుకున్న వాటర్ బాటిళ్లతో డ్రిప్ ఇరిగేషన్**

ప్లాస్టిక్ తో పర్యావరణ పరిరక్షణ ప్రమాదంలో పడింది. అదే ప్లాస్టిక్ ను వినియోగించి నీటిని పొదుపు చేసేలా, రైతులకు మేలు చేసేలా నార్పల విద్యార్థులు రూపొందించిన డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ విశేషంగా ఆకట్టుకుంటోంది. వాడేసి పడేసిన వాటర్ బాటిళ్లను డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ లో వినియోగించారు. మొక్కల పెంపకం సమయంలో గ్రిల్ ఏర్పాటు చేశారు. ఆ మొక్కకు ఆనుకుని ఓ కర్రకు మూడు వాటర్ బాటిళ్ల అడుగు భాగం తీసేసి, ఒకదానిపై ఒకటి అమర్చారు. ఆ బాటిళ్ల ద్వారా మొక్క మొదలులలో చుక్క చుక్క నీరు పడేలా ఈ సిస్టమ్ ను రూపొందించారు. వాటర్ బాటిళ్లతో తయారు చేసిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థతో నీరు ఆదా అవ్వడమే కాకుండా రైతుకు పెట్టుబడి భారం కూడా తగ్గనుంది.

**ప్లాస్టిక్ రహితంగా గురుకులాలు**

వావ్ కార్యక్రమంతో వ్యర్థాలు, ప్లాస్టిక్ అవశేషాలతో పునర్వియోగ వస్తువుల తయారీపై విద్యార్థులు దృష్టి సారించడంతో, వారి సృజనాత్మకతను వెలికి తీయడానికి అవకాశం కలిగిందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణతో పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. గతంలో చిక్కీ రేపర్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలు గురుకులాల ఎక్కడిపడితే అక్కడ దర్శమిచ్చేవి. వావ్ కార్యక్రమంతో కళాకృతులు, పునర్వియోగ వస్తువులు తయారు చేయడంతో, పరిసరాలు ప్లాస్టిక్ రహితంగా మారాయి.

**పర్యావరణ పరిరక్షకులుగా బీసీ బిడ్డలు**

ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పరిసరాలు కూడా అపరిశుభ్రంగా మారుతూ, దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెందుతూ మానవ ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. ఈ నేపథ్యంలో పర్యావరణనానికి హాని కలుగకుండా వ్యర్థాలతో పునర్వినియోగ వస్తువుల తయారీపై బీసీ సంక్షేమ శాఖ దృష్టి సారించింది. వావ్ కార్యక్రమంలో బీసీ గురుకుల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా పునర్వినియోగ వస్తువుల తయారీని ప్రోత్సహించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ గురుకుల విద్యార్థుల అద్భుతమైన, అబ్బుర పరిచే రీతిలో పునర్వినియోగ వస్తువులు తయారు చేశారు. వాడిపడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత ఇనుము, కలప, వస్త్రాలతో ఇంటి అలంకరణ కళాకృతులు, వాటర్ బాటిళ్లతో డ్రిప్ ఇరిగేషన్, స్టడీ టేబుల్, కుర్చీలు రూపొందించి ఔరా అనిపించారు. పర్యావరణ పరిరక్షకులుగా ముందు నిల్చొని సమాజ హితానికి పునాదులు వేశారు. వెన్నుతట్టి ప్రోత్సహిస్తే.. అద్భుతాలు ఆవిష్కరిస్తామని రుజువు చేసిన బీసీ బిడ్డలకు నా అభినందనలు.

### మున్సిపల్ ఎన్నికలకు

## పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్నికల బందోబస్తు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్లు భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. "ఎన్నికల నేపథ్యంలో 1,183 లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. 4,318 మందిని బైండోవర్ చేశాం. 398 నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేశాం. 4 రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 55 చెక్‌పోస్టులు ఉన్నాయి. 181 ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిద్ధం చేశాం. ఇప్పటివరకు రూ.3.09 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 142 కేసులు నమోదు చేశాం. మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం. మహాదేవప్ప ఆత్మహత్య లేఖ రాయలేదని తెలిసింది. ఎఫ్ఎస్ఎల్ ప్రమాదం ఎలా జరిగిందనేది విచారణ చేస్తున్నాం. ఏసీబీ కేసు 2015లో ఉన్న ఆధారాలు కోర్టుకు ఇచ్చాం. ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా అన్నీ పరిశీలించి నివేదికలు ఇచ్చాం. సాంకేతిక నిపుణులతో డేటాను రిట్రీవ్ చేస్తున్నాం" అని డీజీపీ తెలిపారు.

### ప్రజా ప్రతినిధులకు మూడు రోజుల పాటు

## క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారికి ఆటవిడుపు కలిగించాలని క్రీడలు, సాంస్కృతిక విభాగాల అధికారులకు సూచించారు. క్రీడా పోటీల విభాగంలో పాల్గొనటానికి పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆసక్తి కనపర్చుతున్నారని, అంతేకాకుండా సాంస్కృతిక కార్యక్రమంలో కూడా పాల్గొనడానికి ఉత్సుకత చూపుతుండటం హర్షనీయమని అన్నారు. క్రీడల ఈవెంట్ నిర్వహణనకు శాసన సభ, శాసన మండలి చీఫ్ విప్ లు, విప్ లతో ఒక కమిటీ వేయాలన్నారు. అలాగే మూడు రోజుల పాటు నిర్వహించే ప్రజాప్రతినిధుల నిర్ణయించిన మూడు రోజుల్లో క్రీడాపోటీలను మధ్యాహ్నం నుండి జరపాలన్నారు. అలాగే కల్చరల్ కార్యక్రమాలు చివరి రోజు సాయంత్రం నుండి అహ్లాదవాతావరణంలో నిర్వహించేలా కల్చరల్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ సారి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ కుటుంబ సభ్యులతో హజరు కావాలని కోరనున్నామని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు చెప్పారు.

**నిర్వహించనున్న క్రీడల వివరాలు :**

అథ్లెటిక్స్ విభాగంలో పరుగు పందెం, క్యారమ్స్, చెస్, బాడ్మింటన్, టెబుల్ టెన్నిస్, టెన్నీకాయిట్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, పికిల్ బాల్ పోటీలు నిర్వహించాలని ప్రాథమికంగా శాప్ అధికారులు అధికారులు స్పీకర్ అయ్యన్న పాత్రుడి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా స్కిట్స్, ట్రాక్ సింగింగ్ తదితర వీక్షకులను అలరించేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ క్రీడాపోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సాహభరిత, ఉల్లాసభరిత వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఉప సభాపతి కె.రఘురామ కృష్ణరాజు, రవాణా, యువజన మరియు క్రీడాశాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, విప్ యార్లగడ్డ వెంకట్రావ్, శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యే కూన రవికుమార్, శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, ఏపీ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర,డైరక్టర్ ఫర్ కల్చర్ మల్లిఖార్జునరావు, శాప్ ఎండీ భరణి తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకం అందుబాటులో ఉందని నరవణె పోస్ట్

రాహుల్ తెలిపారు. అయితే, ఈ బుక్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంపై ఇప్పటికే దిల్లీ పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.

**తాజా పరిస్థితి ఇది..**

పుస్తకంపై నెలకొన్న తాజా పరిణామాలపై సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం. నరవణె స్పందించారు. నరవణె పుస్తకం ఒక్క కాపీ కూడా ఇంకా ప్రచురితం కాలేదని, అనధికారిక కాపీలు మాత్రమే ఉన్నాయని ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా చెప్పిన విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. పుస్తకం ప్రస్తుత స్థితి ఇది అంటూ పేర్కొన్నారు.

### శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో

## ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో భక్తుల రద్దీ, వసతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ, సౌకర్యాలపై మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డీజీపీతో పాటు ఇతర అధికారులతో దిల్లీ నుంచి ముఖ్యమంత్రి రివ్యూ చేశారు. అధికారులు, జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను, సౌకర్యాలను సమీక్షించారు. శివరాత్రి నాటికి శ్రీశైలంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి అనిత ప్రత్యేక శ్రద్ధతో.. ఏర్పాట్లు, వసతులపై అధికారులతో పర్యవేక్షించాలని సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా, వసతి లభించేలా కార్యచరణ అమలు చేయాలని ఆదేశించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా, అగౌరపరిచేలా ఎవరూ వ్యవహరించవద్దని సూచించారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. శివరాత్రి పర్వదినం వంటి సందర్భాల్లో అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేసేలా ఇప్పటి నుంచే పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను సీఎం ఆదేశించారు.

### బీఆర్ఎస్ నేతలు ఇంకా

## ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారేమో

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ఖమ్మం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాష్ట్ర సమితి నేతలు ఇంకా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారన్న అనుమానం వస్తోందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ఖమ్మం జిల్లా ఎదులాపురం పురపాలక ఎన్నికలపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడిన విషయాలు బయటకు లీక్ కావడంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులతో మాట్లాడిన మాటలు ఎలా విన్నారో పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తామని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

### ఐటీ నిపుణులకు షాక్..

## హెచ్-1బీ వీసా రద్దుకు బిల్లు

**వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలో నివసిస్తూ ఉద్యోగాలు చేస్తున్న వేలాది మంది భారతీయ ఐటీ నిపుణులకు షాకిచ్చేలా అక్కడి చట్టసభలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ ఫ్లోరిడాకు చెందిన రిపబ్లికన్ ప్రతినిధి గ్రెగ్ స్టూబ్ ప్రతినిధుల సభలో బిల్లును ప్రవేశపెట్టారు. 'ఎండింగ్ ఎక్స్‌ప్లాయిటేటివ్ ఇంపోర్టెడ్ లేబర్ ఎగ్జెంప్షన్స్ యాక్ట్' పేరుతో ఈ బిల్లును ప్రతిపాదించారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ చట్టాలను సవరించి హెచ్-1బీ వీసా విధానానికి పూర్తిగా స్వస్తి పలకడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. అమెరికా పౌరుల సంక్షేమం కంటే విదేశీ కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వడం అమెరికా జాతి ప్రయోజనాలకు విరుద్ధమని గ్రెగ్ వాదిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు తక్కువ వేతనాలకే విదేశీయులను తెచ్చుకుంటూ అమెరికా యువతకు దక్కాల్సిన ఉద్యోగాలను హరిస్తున్నాయని, అమెరికా పిల్లల కోసం 'అమెరికన్ డ్రీమ్'ను కాపాడాలంటే ఈ దోపిడీని అరికట్టాలని చెబుతున్నారు. అందుకే ఈ బిల్లును ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. ఒకవేళ ఈ బిల్లు చట్టంగా మారితే అమెరికాలో స్థిరపడాలనుకునే లక్షలాది మంది భారత టెకీల ఆశలపై నీళ్లు చల్లినట్లే. హెచ్-1బీ వీసా పొందుతున్న వారిలో 80 శాతానికి పైగా భారతీయులు, చైనీయులే ఉంటున్నారు. ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం కొత్త హెచ్-1బీ వీసా నిబంధనలను కఠినతరం చేసింది. కొత్త వీసాలపై 1,00,000 డాలర్ల భారీ రుసుమును విధించి షాక్ ఇచ్చింది. పైగా లాటరీ విధానానికి బదులు ఎక్కువ జీతం ఇచ్చే ఉద్యోగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తక్కువ జీతం లేదా ఎంట్రీ లెవల్ ఉద్యోగులకు వీసా ఎంపిక ప్రక్రియలో తక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఫిబ్రవరి 27 నుంచి ఈ విధానం అమల్లోకి రానుంది. ట్రంప్ ప్రభుత్వ కఠిన విధానాలకు తోడు ఈ కొత్త బిల్లు అమెరికా వెళ్లాలనుకునే భారతీయుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

# ఎడిటర్ వాయిస్

## టీడీ జనార్ధన్‌కు పదవీ యోగం.. నిజమేనా..!

టీడీపీ సీనియర్ నేత.. టీడీ జనార్ధన్‌కు సీఎం చంద్రబాబు కీలక చాన్స్ ఇస్తున్నారా? .. రాజ్యసభకు ఆయ నను పంపించాలని నిర్ణయించారా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. సుదీర్ఘకాలంగా టీడీపీతో అనుబంధం పెంచుకున్న టి.డి. జనార్ధన్ మాజీ ఎమ్మెల్సీగా ఉన్నారు. కృష్ణా జిల్లా నుండి శాసనమండలి (ఎమ్మెల్సీ) సభ్యుడుగా గతంలో నామినేట్ అయ్యారు. కృష్ణాజిల్లాకు చెందిన టీడీ జనార్ధన్..1957న జన్మించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ (ఎం.ఎ) చదువుకున్న ఆయనకు .. రాజకీయాలు కొత్తకాదు. జనార్ధన్ తాత, తండ్రి కృష్ణాజిల్లాలోని లింగాల గ్రామానికి సర్పంచ్‌లుగా పనిచేశారు. ఆ తర్వాత.. రాజకీ యాల్లోకి వచ్చిన జనార్ధన్.. కృష్ణా జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ అధ్యక్షుడిగా 9 సంవత్సరాలు పని చేశారు. అనంతరం.. తెలుగుదేశం పార్టీ (టిడిపి)తో తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. 1995లో ఆప్కోబ్ చైర్మన్‌గా తర్వాత.. జెడ్‌పిటిసిగా పనిచేశారు. సహకార సంఘం అధ్యక్షుడుగా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఇక, ప్రజాసేవలోనూ.. జనార్ధన్‌రావుకు మంచి పేరుంది. కృష్ణా జిల్లాలోని లింగాల, పోచవరం, గంగెల్లి గ్రా మాలను దత్తత తీసుకున్నారు. జాతీయ సహకార వ్యవసాయం మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకుల సమా ఖ్యకు చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ క్రమంలోనే వేలాది మంది రైతులకు ఆయన సాయం చేశారు. రుణా లు ఇప్పించి.. సాగును అభివృద్ధి చేశారు. 2015లో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ నుండి శాసనమండలి సభ్యుని గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ తరఫున బలమైన వాయిస్ వినిపించేవారన్న పేరు తెచ్చుకున్నారు.

**బాబు వెంటే..**

సీఎం చంద్రబాబుకు నమ్మిన బంటు మాదిరిగా టీడీ జనార్ధన్ వ్యవహరిస్తారు. ఆయన ఎక్కడ ఉంటే టీడీ కూడా అక్కడే ఉంటారన్న వాదనుంది. చంద్రబాబు ఢిల్లీ వెళ్లినా.. ఆయనకంటే ముందుగా టీడీ అక్కడకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలిస్తారు. ఈ క్రమంలోనే రాజ్యసభకు టీడీని నామినేట్ చేయాలని చంద్రబాబు నిర్ణయించుకున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జూన్‌లో నాలుగు స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒకసీటును టీడీకి ఖరారు చేసినట్టు అత్యంత విశ్వస నీయ వర్గాల సమాచారం.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## వనస్థలిపురం వద్ద లారీని ఢీకొన్న అంబులెన్స్..



### రోగులకు తీవ్రగాయాలు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వనస్థలిపురం ఆటోనగర్ వద్ద ఆగి ఉన్న లారీని ఓ అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్‌తోపాటు ఇద్దరు రోగులకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనంలో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను స్థానికులు అతికష్టం మీద బయటకు తీశారు. ఇద్దరు రోగులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం కారణంగా కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## ఖైరతాబాద్‌లో దారుణం..

### రైలు పట్టాలపై తలపెట్టి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

**ఖైరతాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రైలు పట్టాలపై తల పెట్టి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖైరతాబాద్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన వై.తరుణ్ (30) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇతనికి 2017లో హైదరాబాద్‌కు చెందిన ప్రసన్నతో వివాహమైంది. ఈ దంపతులకు మూడేళ్ల కుమార్తె ఉంది. నగరంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ భార్యతో కలిసి అత్తారింటికి సమీపంలోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. తరుణ్ మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఏడాది నుంచి చికిత్స తీసుకుంటున్నాడు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఖైరతాబాద్ రైల్వే గేటు సమీపంలో పట్టాలపై కనిపించడంతో విధుల్లో ఉన్న గేట్ మెన్ బయటకు పంపించారు. కాసేపటి తర్వాత రైల్వే గేట్‌కు దాదాపు వంద అడుగుల దూరంలో పట్టాలపై తల పెట్టి పడుకున్నాడు. ఆ సమయంలో నాంపల్లి వైపు వెళ్తున్న రైలు ఢీకొనడంతో తల, మొండెం వేరయ్యాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా.. అప్పటికే అతని పక్కన ఉన్న ఫోన్ రింగ్ అవుతోంది. పోలీసులు ఫోన్ లిఫ్ట్ చేసి మాట్లాడగా.. మృతుడి వివరాలు తెలిశాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. నాంపల్లి జీఆర్పీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పెళ్లి పేరిట చెల్లిపై అత్యాచారం

**మచిలీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజం దిగ్భ్రాంతి చెందేలా సొంత చెల్లిని పెళ్లి చేసుకొని, ఆమె గర్భానికి కారణమైన యువకుడికి విజయవాడ పోక్సో కోర్టు జీవితకాలం కారాగార శిక్ష విధించింది. ఓ కుటుంబానికి చెందిన దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుటుంబ గొడవల కారణంగా తల్లిదండ్రులు విడిగా ఉంటున్నారు. ఇద్దరు కుమార్తెలతో తల్లి కృష్ణా జిల్లాలోని ఓ గ్రామంలో ఉంటుండగా, కుమారుడితో కలిసి తండ్రి ప్రకాశం జిల్లాలో స్థిరపడ్డాడు. 2023లో వారి కుమారుడు (21) తల్లి, చెల్లెళ్ల వద్దకు వెళ్తున్నట్లు చెప్పి కృష్ణా జిల్లాలో వారి గ్రామానికి వచ్చాడు. పెద్ద చెల్లి (17)తో సన్నిహితంగా ఉన్న ఫొటోలు తీసుకొని బెదిరించి పలుమార్లు అత్యాచారం చేశాడు. 2024లో క్రిస్మస్ సందర్భంగా వచ్చి.. నాన్న దగ్గరకు వెళ్దామని చెప్పి చెల్లిని విజయవాడలో ఓ చర్చికి తీసుకెళ్లి తాళి కట్టాడు. తర్వాత ఆమెను హైదరాబాద్ తీసుకెళ్లి అనేకసార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు.

**గర్భం దాల్చాక ఒంగోలు బస్టాండులో వదిలేసి:**

ఇదంతా తెలియని తల్లి.. కుమారుడికి ఫోన్ చేసి చెల్లిని పంపించాలని చెప్పింది. గతేడాది ఫిబ్రవరిలో తండ్రి, కొడుకు బాలికను ఒంగోలు బస్టాండులో వదిలేసి హైదరాబాద్ వెళ్లిపోయారు. ఇంటికి చేరిన బాలిక కొద్దిరోజులకు జ్వరం, వాంతులతో అస్వస్థతకు గురైంది. తల్లి వైద్యపరీక్షలు చేయించగా గర్భిణిగా తేలింది. ప్రశ్నించగా.. జరిగిందంతా వివరించింది. తల్లి ఫిర్యాదు మేరకు పమిడిముక్కల పోలీసులు ఆ యువకుడిపై పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసు పెట్టారు. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ నిందితుడిని అప్పట్లోనే అరెస్టు చేశారు. స్పీడ్ ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణ పూర్తయింది. విజయవాడ పోక్సో కోర్టు జడ్జి వి.భవానీ సోమవారం తీర్పు వెలువరిస్తూ.. బాధ్యుడైన యువకుడికి మరణించేంత వరకు జైలుశిక్ష, రూ.6 వేల జరిమానాతో పాటు బాధితురాలికి రూ.30 వేలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి బాలికకు రూ.5 లక్షల సాయం త్వరగా అందేలా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అథారిటీని ఆదేశించారు.


**పురపాలక సంఘం మండపేట**

టెండరు నోటీసు నెం : ఆర్.ఓ.సి.నెం.199/2025-ఇ1 తేది : 10-02-2026

**ఇంజనీరింగు విభాగము - టెండరు నోటీసు**

మండపేట పురపాకల సంఘ ఇంజనీరింగు విభాగము నందు ఈ దిగువనుదహరించిన పనులకు సంబంధించి సీలు వేసిన టెండర్లు మండపేట పురపాలక సంగ కమీషనరు వారిచే లేక వారిచే అధికారము పొందిన వారిచే ఈ దిగువ నుదహరించిన రీతికి టెండర్లు కోరబడుచున్నవి.

1. టెండర్లు స్వీకరించుటకు ఆఖరు తేది : 19-02-2026 సాయంత్రం గం.4.00ల వరకు
2. టెండరు షెడ్యూలు మరియు టెండరు ధరావత్తు చెల్లించుటకు ఆఖరి తేది : ది.18-02-2026
3. టెండరు షెడ్యూలు జారీ చేయు తేదీ : ది.19-02-2026

| వ.నెం. | పనివివరములు | ధరావత్తు | షెడ్యూలు ఖరీదు | కాలపరిమితి |
|---|---|---|---|---|
| 1. | 2026-2027, 2027-2028 మరియు 2028-2029 అనగా 3 సంవత్సరముల కాలమునకు సంబంధించి మండపేట పురపాలక సంఘ పరిధిలో జరుగు వివిధ అభివృద్ధి పనుల నాణ్యత ప్రమాణములు పరిశీలించి 3వ పార్టీ క్వాలిటీ కంట్రోలు ఎష్యూరెన్సు ధ్రువపత్రము జారీ చేయుట గురించి | 10,000/- | 1,000/- | 3 సంవత్సరములు |
| 2. | మండపేట పురపాలక సంఘ 6వ వార్డు, సర్వే నెం.537 నందు 700KL ELSRనిర్మాణము చేయు పనికి భూసార పరీక్ష (సాయిల్ టెస్టింగ్) మరియు స్ట్రక్చరల్ డిజైన్ తయారు చేసి సాంకేతిక అనుమతులు పొందుట | 10,000/- | 1,000/- | 2నెలలు |

టెండర్లు ది.19-02-2026వ తేదీ మధ్యాహ్నం గం.4.00ల వరకు స్వీకరించి అదే రోజు మధ్యాహ్నం గం.4.30ని.లకు హాజరు కాబడిన టెండరుదారులు సమక్షమున లేక వారి ఏజెంట్లు సమక్షమున తెరుపబడును. టెండరు షరతులు మరియు ఇతర వివరములకు కార్యాలయపు పని వేళలలో ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించవలసినదిగా తెలియజేయడమైనది.

సం/- **టి.వి.రంగారావు,** కమీషనరు,
మండపేట పురపాలక సంఘం


## కెనడాలో దుండగుల కాల్పులు..

### బెంగళూరు టెకీ మృతి

**బెంగళూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కెనడాలోని టొరంటోలో శనివారం దుండగులు జరిపిన కాల్పుల్లో బెంగళూరుకు చెందిన టెకీ చందన్‌కుమార్ (37) మృతిచెందారు. ఈ మేరకు అక్కడి పోలీసులు ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కర్ణాటకలోని బెంగళూరు గ్రామీణ జిల్లా త్యామగొండ్లు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నందన్‌కుమార్ ఏకైక కుమారుడు చందన్‌కుమార్ ఏడేళ్లుగా కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 3.31 గంటలకు టొరంటో పరిధిలోని ఓ షాపింగ్ సెంటర్‌లో కాల్పులు జరిగినట్లు టొరంటో పోలీసు సర్వీస్(టీపీఎస్) సిబ్బందికి ఫోన్‌కాల్ వచ్చింది. వారు అక్కడికి వెళ్లేసరికే ఓ వాహనంలో శరీరమంతా బుల్లెట్ గాయాలతో చందన్‌కుమార్ కనిపించారు. వెంటనే ఆసుపత్రికి తరలించినా అప్పటికే మరణించారు. దుండగులు ముందుగా అనుకున్న కుట్రలో భాగంగానే ఈ హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికైతే కాల్పులకు కారణాలు తెలియలేదని ప్రకటించారు. టొరంటోలో ఈ ఏడాది జరిగిన మూడో హత్య ఇది.

**జాతి విద్వేషాలే కారణమా?**


కెనడాలో జాతి విద్వేషాలు హింసాత్మకంగా మారుతున్నాయని భారతీయ కన్నడ సంఘాల సమాఖ్య ధ్వజమెత్తింది. చందన్‌కుమార్ టొరంటోలో కన్నడ సంఘం సమన్వయకర్తగా, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా పనిచేసే వారని ఈ సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ వివరించారు. ఆయన బ్రాంప్టన్ కార్పొరేషన్ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించడం తోపాటు అక్కడి మేయర్‌పై పోస్టులు పెట్టేవారని చెప్పారు. కెనడా రాజకీయాల్లో స్థానికేతరుల ప్రభావం అక్కడి పౌరుల్లో జాతి విద్వేషాన్ని పెంచేలా చేస్తోందని నవీన్‌గౌడ అభిప్రాయపడ్డారు.

## దారుణం.. అత్తకు కరెంట్ షాక్ ఇచ్చి చంపిన అల్లుడు

**గార్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** మహబూబాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అత్తకు అల్లుడు కరెంట్ షాక్ ఇచ్చి చంపాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి గార్ల మండలం సీతంపేట శివారు మంగళతండాలో జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో అత్త కంసాలి (48)ని అల్లుడు రాజేశ్ హతమార్చాడు. మద్యం మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం రాజేశ్ సోదరుడు రమేశ్‌కు అంజలితో రెండో వివాహం జరిగింది. సోమవారం అర్ధరాత్రి మద్యం తాగిన రాజేశ్.. సోదరుడి రెండో వివాహంపై కుటుంబసభ్యులతో వాగ్వాదానికి దిగాడు. అనంతరం నిద్రిస్తున్న అత్త మెడకు విద్యుత్ వైరు చుట్టి షాక్ ఇచ్చి హతమార్చాడు. ఈ క్రమంలో అంజలిపై కత్తితో దాడి చేశాడు. భార్య, తల్లిదండ్రులపై దాడికి యత్నించగా వారు తప్పించుకున్నారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు. కంసాలి మృతదేహాన్ని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# కిసాన్ వాయిస్

## ఫ్యూచర్ సిటీలోని ఆ భూములు రైతులకే..




తెలంగాణలో గత ప్రభుత్వం సేకరించిన ఫార్మా సిటీ భూములను ప్రస్తుత ప్రభుత్వం ఫ్యూచర్ సిటీగా మార్చడంపై వివాదం మొదలైంది. రంగారెడ్డి జిల్లాలో సుమారు 19,333 ఎకరాలను ఒక నిర్దిష్ట 'ప్రజా ప్రయోజనం' (ఔషధ రంగం) కోసం సేకరించారు. అయితే ప్రాజెక్టు మార్పుతో.. 2013 భూసేకరణ చట్టం సెక్షన్ 101 ప్రకారం ఆ భూములను తిరిగి రైతులకు అప్పగించాలనే డిమాండ్ పెరుగుతోంది. ఉద్దేశించిన ప్రాజెక్టును రద్దు చేసి, భూమిని ఇతర వాణిజ్య అవసరాలకు మళ్లించడం చట్టవిరుద్ధమని రైతులు న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. పారిశ్రామిక హబ్ నుండి రియల్ ఎస్టేట్ తరహా ప్రాజెక్టుగా మార్చడం వల్ల తమకు అన్యాయం జరుగుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణలో గత ప్రభుత్వం చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టు చుట్టూ ఇప్పుడు కొత్త వివాదం మొదలైంది. ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం సేకరించిన భూములను ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లిస్తుండటంతో.. ఆ భూములను తిరిగి తమకే ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది.

ఫార్మా సిటీ నుండి ఫ్యూచర్ సిటీ వరకు..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ శివార్లలోని రంగారెడ్డి జిల్లా పరిధిలో దాదాపు 19,333 ఎకరాల భూమిని ఫార్మా సిటీ ఏర్పాటు కోసం సేకరించింది. ఔషధ రంగంలో ప్రపంచ స్థాయి హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఈ ప్రక్రియను పూర్తి చేశారు. అయితే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు స్థానంలో 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మించాలని నిర్ణయించింది. ఫార్మా రంగం కోసం ఇచ్చిన భూములను రియల్ ఎస్టేట్ లేదా ఇతర వాణిజ్య అవసరాలకు వాడటంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉద్దేశించిన ప్రాజెక్టును రద్దు చేసినందున.. భూమిని తిరిగి తమకే అప్పగించాలని వారు కోరుతున్నారు.

## మీ పెరట్లోనే కాస్త్రీ అవకాడో..

### రూ.10లు ఉంటే చాలు ఈజీగా పెంచవచ్చు.. కాయలే కాయలు..

సతీష్ దూబే సూచనలతో ఇంట్లోనే అవకాడో మొక్కను సులభంగా పెంచి, రసాయనాలు లేని పండ్లు పొందవచ్చు. దీని వల్ల ఆరోగ్యం, డబ్బు ఆదా రెండూ సాధ్యమవుతాయి.

ప్రస్తుత కాలంలో ప్రజలు ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ క్రమంలో 'సూపర్ ఫుడ్' అని పిలువబడే అవకాడో ఫలానికి మార్కెట్‌లో భారీ డిమాండ్ ఏర్పడింది. అయితే, ఇవి కేవలం విదేశాల్లోనో లేదా పెద్ద పెద్ద తోటల్లోనో మాత్రమే పండుతాయని చాలామంది భావిస్తారు. కానీ, మన ఇంటి బాల్కనీలో లేదా మిద్దె తోటలో అవకాడో మొక్కను సులభంగా పెంచుకోవచ్చని వ్యవసాయ నిపుణుడు సతీష్ దూబే వివరిస్తున్నారు. ఇంటి వద్దే అవకాడో మొక్కను పెంచే విధానం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఈ సమగ్ర కథనంలో తెలుసుకుందాం.



అవకాడోను విత్తనం ద్వారా పెంచడం ఒక ఆసక్తికరమైన ప్రక్రియ. దీనికోసం మీరు మార్కెట్ నుంచి తెచ్చిన ఎవోకాడో ఫలంలోని విత్తనాన్ని సేకరించాలి. ముందుగా విత్తనాన్ని ఎటువంటి గుజ్జు లేకుండా శుభ్రంగా కడగాలి. ఈ విత్తనాన్ని నేరుగా మట్టిలో నాటకుండా, 4 నుంచి 6 వారాల పాటు నీటిలో ఉంచాలి. విత్తనం సగం నీటిలో మునిగేలా అమర్చాలి. కొన్ని రోజుల తర్వాత విత్తనం నుండి వేర్లు చిన్న మొలక రావడం గమనించవచ్చు. ఇదే మొక్క ఎదుగుదలకు మొదటి సంకేతం.

కుండీలో నాటే విధానం: విత్తనం నుంచి మొలక వచ్చిన తర్వాత, దానిని మట్టిలో నాటాలి. అవకాడో మొక్కకు నీరు నిల్వ ఉండని తేలికపాటి మట్టి ఉండాలి. పోషకాలు సమృద్ధిగా ఉండే ఎరువులను మట్టిలో కలపాలి. కుండీకి అడుగున రంధ్రాలు ఉండటం చాలా ముఖ్యం. దీనివల్ల అదనపు నీరు బయటకు వెళ్లిపోయి, వేర్లు కుళ్ళిపోకుండా రక్షణ లభిస్తుంది.

అవకాడో మొక్క ఆరోగ్యంగా పెరగాలంటే సరైన వాతావరణం అవసరం. ఈ మొక్కకు రోజుకు కనీసం 6 గంటల సహజమైన సూర్యరశ్మి అవసరం. దీనిని ఎండ తగిలే వెచ్చని ప్రదేశంలో ఉంచాలి. గాలిలో తేమ శాతం తగినంతగా ఉంటే మొక్క ఎదుగుదల వేగంగా ఉంటుంది. మట్టి ఎప్పుడూ స్వల్ప తేమతో ఉండాలి, కానీ నీరు ఎక్కువై బురదగా మారకూడదు. మట్టి పైపొర 1 నుంచి 2 అంగుళాల వరకు ఎండిపోయినట్లు అనిపిస్తేనే తిరిగి నీరు పోయాలి. అతిగా నీరు పోయడం వల్ల మొక్క చనిపోయే ప్రమాదం ఉంది.

ఇంట్లో పెంచే అవకాడో మొక్కలు వాణిజ్య తోటల వలె త్వరగా ఫలాలను ఇవ్వవు. కొన్ని హైబ్రిడ్ రకాలు 2 నుండి 3 ఏళ్లలోనే కాపుకు వస్తాయి. సాధారణ విత్తన రకాలు ఫలాలను ఇవ్వడానికి 8 నుంచి 10 ఏళ్ల సమయం తీసుకోవచ్చు. అందుకే అవకాడో సాగులో ఓర్పు చాలా ముఖ్యం. ఒకవేళ పండ్లు రాకపోయినా, ఈ మొక్క తన అందమైన ఆకులతో మీ ఇంటికి అలంకార ప్రాయంగా మారుతుంది.

సతీష్ దూబే గారి అభిప్రాయం ప్రకారం, ఇంట్లో అవకాడో పెంచడం వల్ల మనకు స్వచ్ఛమైన, రసాయనాలు లేని పండ్లు లభిస్తాయి. మార్కెట్‌లో ఒక్కో అవకాడో ధర రూ.100 నుంచి రూ.300 వరకు ఉంటుంది. మనమే పండించుకోవడం వల్ల దీర్ఘకాలంలో భారీగా డబ్బు ఆదా అవుతుంది. కొద్దిపాటి శ్రద్ధ, సరైన అవగాహన ఉంటే మీరు మీ ఇంటినే ఒక చిన్న అవకాడో తోటగా మార్చుకోవచ్చు.

### కూటమి ప్రభుత్వం

# గిరిజన విద్యార్థులకు అన్యాయం చేస్తుంది

**ప్రభుత్వం పంపిణీ చేసిన సరుకులు నాణ్యత లోపం - దేవరపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థుల పరిస్థితి దీనికి నిదర్శనం**
**ఈ ఘటనపై ప్రత్యేక కమిటీని నియమించాలి - హాస్టల్స్‌లో సిబ్బంది కొరత లేకుండా చూడాలి**
**దేవరపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులను పరామర్శించిన పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్**



**రంపచోడవరం/మారేడుమిల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా సంక్షేమ హాస్టల్స్‌లో సంక్షోభాన్ని విషాద కరమైన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. నిలువటద్దం లాంటి నిదర్శనం పోలవరం జిల్లా దేవరపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఈ నెల 7వ తేదీన విద్యార్థులు ఇడ్లి- బొంబాయి చెట్నీ మెనూలో అల్పాహారాన్ని తీసుకున్న విద్యార్థులు గంట వ్యవధిలో అనారోగ్యానికి గురై 107 మంది విద్యార్థులు అస్వస్థకు గురయ్యారు. చిన్న వయసులో ఇలాంటివి జరగడం వల్లన భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. వీరిని మారేడుమిల్లి, రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు విద్యార్థులకు ప్రాణహాని తప్పిందని 90 మంది విద్యార్థులను తిరిగి ఆశ్రమ పాఠశాలలకు పంపించారు . మిగతా విద్యార్థులు హాస్పిటల్ నుండి రావలసివుంది. వారి రక్త నమూనా లు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు రిపోర్ట్స్ వస్తే నిజనిర్ధారణ అవుతుంది. ఆశ్రమ పాఠశాల కి వచ్చిన విద్యార్థులని అక్కడ మెడికల్ సిబ్బంది అందరినీ అబ్సర్వ్ లో ఉంచారు. కూటమి ప్రభుత్వం పంపిణీ చేసిన సరుకులు నాణ్యత లోపం కారణంగా జరిగిందని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం చెబుతుంది రోజుకి 26 రకాల కేలరీలు భోజనం విద్యార్థులు తీసుకుంటే పౌష్టికాహారం అంది విద్యార్థులు చురుగ్గా రాణిస్తారని చెబుతూ రోజుకి 35 రూపాయలు మెనూ అందిస్తుంది. ఈ రోజు బయట ఒక ప్లేట్ టిఫిన్ చేస్తే కనీసం 30 రూపాయలు ఉంటుంది అలాంటిది ఒక పూట టిఫిన్ 2 పూటలు భోజనం, స్నాక్స్, పాలు, ఇవ్వని ఎలా సాధ్యమో సీఎం నారా చంద్రబాబు చెప్పాలి. వారి మనమడు దేవాన్ష్ ఒక రోజుకి 35 రూపాయలు సరిపడా ఫుడ్ తీసుకుంటున్నాడా చెప్పాలి..? డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదివాసీ దినోత్సవాలకు వెళ్లి వాళ్ళతో ఫోటోలు, డాన్స్‌లు చెయ్యడం కాదు వారి జీవితాలు చూడమని మేము చెప్పదలుచుకున్నాం. తల్లి దండ్రులకు లేని చదువులు బిడ్డలకు అందాలని హాస్టల్స్ కి పంపిస్తుంటే వారి జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటమాడడం మంచిపద్దతి కాదని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గిరిజన ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలి. అధికారం లోకి వచ్చి 2 సంవత్సరాలు కాలంలో నక్కపల్లి పాడేరు లాంటి ఆశ్రమ, గురుకులాలలో జరిగిన సంఘటను చూసి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పి హామీ ఇచ్చి తిరిగి ఇలాంటి ఘటనలు జరుగుతున్న కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తకపోవడం మీద పీడీఎస్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ మండిపడ్డారు. నేటికి అక్కడ ఏఎన్ఎమ్ పోస్టులు విడుదల చెయ్యడం లేదు స్కావెంజర్స్‌ని



నియమించడం లేదు ఆఖరికి అక్కడ పిల్లలు పరిశీలనకు వెళితే వారి తల క్షవరాలు వారే చేసుకోవడం, అక్కడ చెట్లు నుండి వచ్చే చెత్తను వారే శుభ్రం చెయ్యడం వంట గది అపరిశుభ్రంగా వుండడం మెనూ బోర్డ్ అమలుకు నోచుకోకపోవడం వార్డెన్, అధికారులు నిర్లక్ష్యం వహించడం అక్కడ హాస్టల్ మెస్ కమిటీలకు బాధ్యత అప్పగించి వెళ్లిపోవడం కేవలం సరుకులు వస్తున్న సమయంలో అధికారులు వచ్చే సమయంలో రావడం చేస్తున్నారు దీనివలన విద్యార్థుల మంచి చెడ్డలు చెప్పే పరిస్థితి లేదు. ఎముకలు కొరికే చలిలో స్వెటర్స్, జమ్ముఖానాలు, దోమలు మెస్‌లు, మినరల్ వాటర్ సదుపాయం ఏమీ లేవు గతంలో ముసురుమిల్లిలో కాలువలో ఒక విద్యార్థి చనిపోయి దాదాపు 4 రోజులుకు దొరికిన పరిస్థితి ఇలాంటివి అన్ని నిదర్శనాలు అని కిరణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించి ప్రత్యేక కమిటీని నియమించాలని అకస్మాత్తుగా దర్యాప్తులు చెయ్యాలని డిమాండు చేశారు.

# ఒక్క నిర్లక్ష్యం.. ఓ కుటుంబానికి విషాదం.!

**రోడ్డు భద్రతపై దేవీపట్నం పోలీసుల హెచ్చరిక !**

**అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి తే చట్టపరమైన చర్యలు - సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**



దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ : పోలవరం జిల్లా పోలీస్ శాఖ ప్రజల రోడ్డు భద్రతను అత్యంత ప్రాధాన్యంగా పరిగణిస్తూ, ప్రమాదాలను తగ్గించి ప్రతి పౌరుడి ప్రాణాన్ని కాపాడే దిశలో మరింత విస్తృతమైన, సమగ్రమైన అవగాహన కార్యక్రమాలను అమలు చేస్తోంది. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుంది. ప్రజల్లో బాధ్యతా యుత డ్రైవింగ్‌పై చైతన్యం పెంచడానికి జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం దేవీపట్నం ఎస్సై షరీఫ్ ఆధ్వర్యంలో పరగసనపాడు ఆర్ ఆర్ కాలనీలో ప్రతీ వాహనధారుడు ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని ఆయన తెలిపారు. అదేవిదంగా సెల్ ఫోన్ మాట్లాడు తూ నిర్లక్ష్యంగా వాహనం నడపటం వల్ల ప్రమాదం సంభవించడంతో పాటు ఇతరుల ప్రాణాలకు హాని జరిగే అవకాశం ఉందని ఆయన వాహన దారులకు సూచనలు చేశారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సామాజిక మాధ్యమాలలో వచ్చే అనవసర సందేశాలకు ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలని, నాటుసారా, బెల్ట్ షాప్ లో మద్యం విక్రయం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్సై షరీఫ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవీపట్నం పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పోలవరం జిల్లాలో 100% ఉత్తీర్ణతే లక్ష్యం

**ఏజెన్సీ డిఈఓ మల్లేశ్వరరావు - జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టంగా ప్రీ-ఫైనల్ పరీక్షలు**



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** 2026 సంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి ప్రీ- ఫైనల్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రారంభం అయ్యాయి. మంగళ వారం ఏజెన్సీ డిఈఓ మల్లేశ్వరరావు ఇర్లపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల అలాగే రంపచోడవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఆయన పర్యవేక్షించారు. మార్చిలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషి చేస్తున్నామని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆయన తో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శివరాత్రి వేడుకలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

**క్షేత్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

రాబోయే మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ మంగళవారం పామర్రు, ద్రాక్షారామం పోలీస్ స్టేషన్ పరిధిలోని పుణ్యక్షేత్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదట పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటిపల్లి పంటిరేవును ఎస్పీ సందర్శించారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పంట్లపై సామర్థ్యానికి మించి భక్తులను ఎక్కించకుండా చూడాలని, ప్రయాణించే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పంటిరేవుకు వెళ్లే మార్గంలో బారికేడ్లు, సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్నాన ఘట్టాల వద్ద ప్రమాదాలు జరగకుండా నీటిలో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లు, పడవలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. మహిళా భక్తుల కోసం ప్రత్యేకంగా బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని, రేవుల వద్ద తగినంత వెలుతురు ఉండేలా చూడాలని సూచించారు. జల్లు స్నానాలు ఆచరించే విధంగా భక్తులను ప్రోత్సహించాలని కూడా పేర్కొన్నారు. కోటిపల్లి, ముక్తేశ్వరం రేవుల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ద్రాక్షారామంలోని మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయాన్ని ఎస్పీ సందర్శించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున క్యూలైన్లలో తొక్కిసలాట జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఆలయ పరిసరాలు, పార్కింగ్ ప్రాంతాల్లో భద్రతను మరింత పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, శివరాత్రి పర్వదినాన వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు. భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, క్షేత్రాల వద్ద నిరంతరం నిఘా ఉంచుతూ శాంతి భద్రతలను కాపాడాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, ద్రాక్షారామం ఎస్సై లక్ష్మణ్, పామర్రు ఎస్సై, ఎస్‌బీసీఐ పుల్లారావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

### స్వర్ణాంధ్రలో చిరు వ్యాపారులకు

# గొడుగుల బహుకరణ

**చిరు వ్యాపారులకి గొడుగులు ఉచితంగా అందిస్తాం..**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రోడ్డుకు ఇరువైపులా చిన్న చిన్న వ్యాపారం చేసుకునే వారికి ఎండా వానల నుంచి రక్షణ కొరకు గొడుగులు బహుకరించినట్లు స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు రాంబాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం స్థానిక స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ప్రాంగణం వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వివిధ వ్యాపారాలు చేసుకునే 10 మంది చిరు వ్యాపారులకు గొడుగులను బహుకరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ జాతీయ గొడుగుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం ఉదయం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాజమండ్రి నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, అలాగే పూర్వపు ఉభయ గోదావరి జిల్లాలలోని అన్ని మండల కేంద్రాలలో స్వర్ణాంధ్ర గొడుగులు అందించమన్నారు.. ఇప్పటివరకు సుమారు 5400 మందికి ఉచితంగా గొడుగులు అందించామన్నారు. ఉచితంగా గొడుగు కావలసినవారు వ్యాపారం చేస్తున్న ఫోటో మరియు ఆధార్ కార్డు జిరాక్స్‌తో లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సంప్రదించాలని రాంబాబు కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సిబ్బంది దివ్య, మీరా కుమారి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రి నుండి 13 మంది విద్యార్థులు డిశ్చార్జ్

**విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైనా చర్యలు: ఐటీడీఏ పిఓ స్మరణ్ రాజ్**



**రంపచోడవరం/మారేడుమిల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** మారేడుమిల్లి మండలం దేవరపల్లి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వాంతులు విరోచనాలు, కడుపు నొప్పితో బాధపడుతున్న వారిని మెరుగైన వైద్య సేవలు అందించి రంపచోడవరం ఏరియా ఆస్పత్రి నుండి ఈరోజు 13 మంది విద్యార్థులను డిశ్చార్జ్ చేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ గత శనివారం దేవరపల్లి ఆశ్రమ పాఠశాలలో కడుపునొప్పి, వాంతులు విరోచనాలతో బాధపడుతున్న వారిని హుటాహుటిన రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి మెరుగైన వైద్య సేవల కొరకు తరలించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ రోజు అనగా మంగళవారం 13 మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఆరోగ్యం బాగున్నందున ఆసుపత్రి నుండి డీఛార్జీ చేయడం జరిగిందని ఆయనతెలిపారు. ఈరోజు ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న విద్యార్థులు అందర్నీ డిశ్చార్జ్ చేసి దేవరపల్లి ఆశ్రమం పాఠశాలకు విద్యార్థులను తీసుకుని వెళ్లడం జరిగిందని ఆయన తెలిపారు. దేవరపల్లి ఆశ్రమ పాఠశాలలో డీఎం అండ్ హెచ్ ఓ పి.సరిత ఆధ్వర్యంలో 7వ తారీఖు నుండి విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా నిరంతరముగా ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా విద్యార్థుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహించిన ఎడల శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థికి కాచి చల్లార్చిన త్రాగునీరు ప్రతిరోజు అందించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

### కొత్తపేట నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా

# నూతన కార్యవర్గం ఎన్నిక



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్‌కు నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. రావులపాలెం సి.ఆర్.సిలో జరిగిన సమావేశంలో నియోజకవర్గానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా దారపురెడ్డి సాయి మెహర్ (ఎన్ టీవీ) సలహాదారులుగా పెరవలి వెంకటేశ్వరరావు (జిల్లా వాణి ఛానల్), బండి దత్తు (ఆర్ టీవీ) ఎన్నిక కాగా అధ్యక్షుడిగా దారపురెడ్డి సత్యనారాయణ (ఏబీఎన్), ఉపాధ్యక్షుడిగా రాయుడు జయదేవ్( బిగ్ టీవీ), కార్యదర్శిగా వరసాల శ్రీనివాస్ (ఏపీ లోకల్ టీవీ), సంయుక్త కార్యదర్శిగా నామాడి శివాజీ(99 టీవీ), కోశాధికారిగా దాసరి సత్తిబాబు (6 టీవీ) లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా యు.వెంకటేశ్వరరావు (ఇండియా టుడే), జి.వి. రాజు(ఎస్ఎల్‌టీ), కె. ఆనంద్ (1 టీవీ), రవి ప్రదీప్ (ఐ న్యూస్), ఇళ్ళ విక్రమరావు (మెగా 9 టీవీ), వై. బంగారాజు (ఆంధ్ర న్యూస్ ఛానల్), బొరుసు సాయి (ఇమేజ్ న్యూస్ ఛానల్) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, మీడియా గౌరవం పరిరక్షణ, ప్రజలకు నిజమైన సమాచారం అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# పేదలకు ఉచిత వైద్య శిబిరం

**- ఉచితంగా మందులు పంపిణీ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక రాజేంద్రనగర్ లో వేంచేసియున్న శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయములో కనకదుర్గ భవానీ దీక్ష పీఠం ఆధ్వర్యంలో ప్రతి నెల 10వ తేదీన నిర్వహించే పేదల ఉచిత వైద్య శిబిరంలో వైద్య శిబిరాన్ని మంగళవారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు సారథ్యంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరములో డాక్టర్ ఎమ్వీఆర్ మూర్తి రాజమండ్రి మున్సిపల్ కార్పోరేషన్ విశ్రాంత ఆరోగ్య అధికారి పాల్గొని సాధారణ వ్యాధులకు వైద్యం అందించారు. మేక్సీ విజన్ కంటి ఆసుపత్రి వైద్యులచే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయం గురు భవానీ నీలాద్రి వెంకట రమణ, కొంతం కృష్ణ, కాలేపు సాయిరాం, తూతిక బాలసుబ్రహ్మణ్యం, బొట్టా వీరబాబు, పిఎంపి రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జిల్లా కార్యదర్శి పి దేవానందం, జిల్లా కోశాధికారి పి చిన్ని, పీఎస్వీ ప్రసాద్, పీవీవీ సత్యనారాయణ, సాయిరామారెడ్డి, జి వెంకటేష్, మెక్సి విజన్ ఐ హాస్పిటల్ ఆప్తమాలజిస్ట్ అరుణ, క్యాంప్ కౌన్సిలర్ సాయికుమార్, సుదీర్ క్యాంప్ కో ఆర్డినేటర్, అండలూరి లక్ష్మీ, జోగా నాగలక్ష్మి, ఎమ్ చిట్టిబాబు, ప్రసన్న కుమార్, ఈశ్వరి, నీలాద్రి వాసు, నీలాద్రి ప్రసాద్, నీలాద్రి రమ్య, పడాల హరిత తదితరులు పాల్గొన్నారు.

### రంపచోడవరం నియోజకవర్గం అభివృద్ధికి

# ఎమ్మెల్యే శిరీషదేవి విశేష కృషి

**మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు**



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** రంపచోడ వరం నియోజకవర్గ సశాన సభ్యురాలు మిరియాల శిరీష దేవి ఆదేశాల మేరకు దేవీపట్నం మండల కొండ మొదలు గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షులు కొనుతుల బాబురావు అధ్యక్షతన సమావేశం నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు మాట్లాడుతూ దేవీపట్నం మండలంలో కొండమొదలు గ్రామంలో ప్రతి కార్యకర్త రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని ప్రతి కార్యకర్త పనిచేయాలని మండలంలో ప్రతి పంచాయతీలో ప్రతి వార్డు మెంబర్ నుండి ప్రెసిడెంట్, ఎంపీటీసీ జడ్పిటిసిల వరకు తెలుగుదేశం పార్టీ గెలిపించుకోవాలని అలాగే పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి పథకాలైన సూపర్ సిక్స్, మహాలక్ష్మి కార్యక్రమాలైన తల్లికి వందనం మహిళకు ఉచిత దీపం పథకం, స్త్రీ శక్తి పథకం, అన్నదాత సుఖీభవ, వృద్ధులకు 4 వేల రూపాయల పెన్షన్ వికలాంగులకు 6000 పెన్షన్ , దీర్ఘ కాళికా వ్యాధి గ్రాస్తులకు 10000/- నుండి 15000 వేల పెన్షన్ ఇలా ఎన్నో పథకాలు మన కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని, అలాగే డిఎస్సి ఉద్యోగాలు, ఆగిపోయిన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు, అమరావతి రాజధాని అభివృద్ధి, ప్రపంచ దేశాల నుండి రాష్టానికి పెట్టుబడిలు తీసుకొని వచ్చి రాష్టాన్ని అభివృద్ధి బాట మరియు ఇచ్చిన మాట ప్రకారం యువత కు ఉద్యోగ అవకాశలు కల్పింది అని, అలాగే గ్రామ కమిటీ లో ఏమైనా ఇబ్బందులు ఉంటే గ్రామ కమిటీ లోనే పరిష్కారం చేసుకోవాలని అవని పక్షంలో మండల కమిటీ లో సమస్యల్ని పరిష్కరిస్తామని చెప్పడం జరిగింది, కార్యకర్తలకు దశనిర్దేశం చేశారు. గ్రామ కమిటీ సమావేశం లో నిర్వాశితులైన కొండమొదలు గ్రామస్తులు పలు సమస్యలైన ఆర్ & ఆర్ సమస్యలు భూమికి భూమి పెన్షన్ సమస్యలు తీసుకొని రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు, మాజీ మండల అధ్యక్షులు ముంద్రు మధుసూదన్ రావు ఇందుకూరు పేట సొసైటీ అధ్యక్షులు మాగపు బాబురావు, మార్కెటింగ్ డైరెక్టర్ జొన్నల రాంబాబు, ఐటీడీపి అధ్యక్షులు అంజిరెడ్డి, ఐటిడిపి కార్యదర్శి కుటుంబ రెడ్డి, బూత్ ఇంచార్జ్ పాతాళ పండు, బూతు బడిశా బుచ్చయ్య, బడిగుంట రాజారెడ్డి, ఖ సురేష్, అందాల లక్ష్మి, చెదల నాగిరెడ్డి, తాళ్లూరి గణేష్ రెడ్డి, చెదల పోశమ్మ, అందాల పోశమ్మ, నేరం స్వామి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
బుధవారం, 11 ఫిబ్రవరి 2026
www.viswamvoice.com



### డంపింగ్ యార్డ్ కాదు...

# ఇది కుమ్మరి కాలువ..

**అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారిన మేజర్ డ్రైన్**
**చెత్త, పొగ, దుర్వాసనతో రైతుల జీవనం నరకం**




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం రూరల్ మండలం, ఈదరపల్లి పంచాయతీ పరిధిలోని కుమ్మరి కాలువ (మేజర్ డ్రైన్) ప్రస్తుతం డంపింగ్ యార్డ్‌ను తలపిస్తూ భయంకర స్థితికి చేరుకుంది. అమలాపురం, అల్లవరం మండలాలకు కీలకమైన సాగునీటి పారుదలతో పాటు మురుగునీటి నిర్వహణకు ప్రాణాధారంగా ఉన్న ఈ డ్రైన్‌ను, అనధికారికంగా చెత్త పారవేత కేంద్రంగా మార్చడంపై స్థానిక రైతులు, ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించడంతో, ఈ మేజర్ డ్రైన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, గృహ చెత్త, నిర్మాణ వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. ఫలితంగా, వర్షాకాలంలో మురుగునీరు సాఫీగా ప్రవహించలేక పొలాలను ముంచెత్తుతోంది. ఇప్పటికే అప్పారి వారి పాలెం డ్రైన్ ఆక్రమణల బారిన పడినా అధికారులు పట్టించుకోలేదని, ఇప్పుడు అదే నిర్లక్ష్యం కుమ్మరి కాలువకూ పట్టిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలువలో పేరుకుపోయిన చెత్తను అక్కడికక్కడే నిప్పంటించడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన పొగతో కమ్మేస్తోంది. ముఖ్యంగా కొంకాపల్లి, ఈదరపల్లి గ్రామాలు, ఎస్ కె బి ఆర్ కాలేజ్ పరిసర ప్రాంతాల్లో గాలి కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. శ్వాసకోశ సమస్యలు, కళ్ల మంటలు, తలనొప్పులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విశేషమేమిటంటే, జిల్లా కలెక్టర్ బంగ్లా ఈ ప్రాంతానికి సమీపంలోనే ఉన్నప్పటికీ, డ్రైనేజీ ఉన్నతాధికారులు మాత్రం ఈ సమస్యపై కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. నిత్యం దుర్వాసన, పొగ, ముంపు భయంతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంటలు నష్టపోతున్నాయి, ఆరోగ్యం క్షీణిస్తోంది అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత డ్రైనేజీ, పంచాయతీ, రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి, కుమ్మరి కాలువలో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని, కాలువను డంపింగ్ యార్డ్‌గా మార్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రైన్ ఆక్రమణలను పూర్తిగా అరికట్టాలని రైతులు, స్థానిక ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలకు సిద్ధమని వారు హెచ్చరిస్తున్నారు.

### ఎమ్మెల్యే పనితీరుపై

## ప్రశంసలు కురిపిస్తున్న ప్రజలు : గుబ్బల మూర్తి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు నియోజకవర్గంలో 25 కోట్ల రూపాయలు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు ఎమ్మెల్యే పనితీరుపై ప్రశంసలు కురిపిస్తున్న ప్రజలు కొత్తపేట నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. అభివృద్ధిపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. అభివృద్ధి ధ్యేయంగా ఎమ్మెల్యే సత్యానందరావు పనిచేస్తున్నారని కొత్తపేట మండల టిడిపి నాయకులు తెలిపారు.నేడు కొత్తపేట మండలంలో సుమారు 3 కోట్ల 30 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.అనతి కాలంలో ఇంతటి భారీ స్థాయిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత బండారు సత్యానందరావుకే దక్కుతుందన్నారు.అభివృద్ధి పనుల్లో భాగంగా కొత్తపేట మండలంలోని పలు గ్రామాలలో శంకుస్థాపనలు చేస్తూ కూటమి నాయకులతో శరవేగంగాఎమ్మెల్యే ముందుకు కదిలారు. వారితో పాటు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా కొత్తపేట శివారు బండారుపేట, కొత్తపేట, మందపల్లి, పలివెల, గంటి బిళ్ళకూరు వానపల్లి గ్రామాలలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆవిడి గ్రామంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన విరామ సమయంలో నాయకులు సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి కొరకు అహర్నిసలు పాటుపడుతున్న ఎమ్మెల్యే ప్రశంసించారు.సీనియర్ నాయకుడుగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారన్నారు. ఆయనతో కలిసి పనిచేయటం అదృష్టంగా భావిస్తున్నామని నాయకులు తెలిపారు. పూలమాలలు శాలువలు తీసుకురావద్దని ఎమ్మెల్యే సత్యానందరావు ముందుగానే తెలియజేసినప్పటికీ ఆయన మీద ఉన్న అభిమానంతో గ్రామాలలో పూలమాలలు శాలువాలుతో సత్కరిస్తూనే వచ్చారు. పూలబాటపై నడిపించారు.అభివృద్ధి అంటే సత్యానందరావు సత్యానందరావు అంటేనే అభివృద్ధి అన్నట్టుగా నియోజవర్గంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ముత్యాల బాబ్జి దరణాల రామకృష్ణ కంఠంశెట్టి శ్రీనివాసరావు గుబ్బల మూర్తి పల్లి భీమారావు మాసాపత్తుల ఆనందరావు బండారు వీరబాబు చికరమిల్లి లోవరాజు సిద్ధంశెట్టి సత్యనారాయణ బండారు సూరిబాబు పాలూరి సత్యానందం చింతం కృష్ణ సయ్యపరాజు రామకృష్ణంరాజు రెడ్డి శ్రీనివాస్ గలిసెట్టి వీరేష్ బూసి జయలక్ష్మి భాస్కరరావు కంఠంశెట్టి సంటి బండారు రాజేష్ దోనబోయిన ప్రదీప్ మట్ట బాలు గుబ్బల సుబ్రహ్మణ్యం తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు..

### గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు

## మెరుగుపడేలా నిరంతర చర్యలు : ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్లెల రూపురేఖలు మార్చడానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి కొత్తపేట మండలంలో రూ.3 కోట్ల 57 లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు, రూ.1 కోటి 80 లక్షలతో వెల్నెస్ సెంటర్ల నిర్మాణానికి, మొత్తం రూ. 5 కోట్ల 37 లక్షలతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పల్లెల రూపురేఖలు సమూలంగా మార్చడానికి, గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడేలా నిరంతర చర్యలు చేపడుతున్నామని ఆయన అన్నారు.కొత్తపేట మండలం లోని పలు గ్రామాల్లో మొత్తం రూ.5 కోట్ల 37 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు నిర్వహించారు. ఇందులో రూ.3 కోట్ల 57 లక్షలతో సీసీ రహదారులు, డ్రెయిన్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు, రూ.1 కోట్ల 80 లక్షలతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వెల్నెస్ సెంటర్ల నిర్మాణాలకు శంకుస్థాపన నిర్వహించారు. వాడపాలెంలో రూ.35 లక్షలతో ఆర్ అండ్ బి రహదారి, పలు సీసీ రోడ్లు డ్రైన్లు నిర్మాణానికి ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో వాడపాలెం పెదపేట వద్ద ఎమ్జీఎన్ ఆర్జీఎస్ నిధులు రూ.55 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొత్తపేట శివారు బండారు పేటలో రూ.36 లక్షలతో నిర్మించనున్న గ్రామీణ ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో బీసీ కమ్యూనిటీ హాల్, తదితర ప్రాంతాల్లో ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులు రూ.42 లక్షలతో చేపట్టిన పలు సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మందపల్లిలో రూ.36 లక్షలతో నిర్మించనున్న గ్రామీణ ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. పలివెల గ్రామపంచాయతీ పరిధిలో పలు ప్రాంతాల్లో ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులు రూ.75 లక్షలతో చేపట్టిన పలు సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గంటి గ్రామపంచాయతీ పరిధిలో రూ.30 లక్షల ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులతో చేపట్టిన సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణానికి, రూ.36 లక్షలతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ కు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆవిడిలో రూ.50 లక్షల ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులతో చేపట్టిన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. బిల్లకుర్రులో రూ.70 ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులతో చేపట్టిన సిసి రహదారి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. వానపల్లిలో రూ.72 లక్షలతో నిర్మించనున్న 2 విలేజ్ హెల్త్ క్లినిక్ శంకుస్థాపన నిర్వహించారు. అభివృద్ధి పనుల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని, ఆరోగ్య సేవలు చేరువవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

### రూ.2.08 కోట్ల అభివృద్ధి పనులతో

## రామచంద్రపురం పట్టణానికి కొత్త ఊపిరి

**అభివృద్ధే లక్ష్యంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ దూకుడు పాలన**
**కోటిపల్లి -ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి సాధనే లక్ష్యం : మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.2 కోట్ల 8 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, సీసీ డ్రైనేజీ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. రాజు, డిఈ శ్రీకాంత్, కూటమి పార్టీ నాయకులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 28వ వార్డులో రూ.15.55 లక్షలతో సిమెంట్ రోడ్డు, 20వ వార్డులో కేఎస్ఆర్ నగర్‌లో రూ.9.50 లక్షలతో సీసీ రోడ్డు, రూ.12.50 లక్షలతో సీసీ డ్రైనేజీ, రూ.15 లక్షలతో ప్రధాన సీసీ రోడ్డు, 19వ వార్డు కమ్మవారి సావరంలో రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్డు, 13 మరియు 16వ వార్డులు శ్రీరామ్ నగర్‌లో జీసస్ ప్రేయర్ హౌస్ పక్కన రూ.16.30 లక్షలతో సీసీ రోడ్డు, అదే ప్రాంతంలో రూ.11.45 లక్షలతో సిమెంట్ రోడ్డు, 11వ వార్డులో రూ.32.48 లక్షలతో సిమెంట్ రోడ్డు, 4వ వార్డులో పాత గీతా థియేటర్ వద్ద రూ.7.74 లక్షలు మరియు రూ.13.57 లక్షలతో సీసీ రోడ్లు, 23వ వార్డులో మోడ్రన్ కళాశాల రోడ్డుకు రూ.39.95 లక్షలతో సీసీ రోడ్డు, 28వ వార్డులో చింతపల్లి సూరన్న నగర్‌లో రూ.19 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. పలు వార్డుల్లో మొక్కలు నాటారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్స్ ద్వారా మొత్తం 12 అభివృద్ధి పనులు పూర్తి కావడం పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ.130 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఇటీవల ఆదివారం పేట వద్ద రూ.5 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్, విద్యుత్ ఆధునికీకరణ పనులు ప్రారంభించడం ద్వారా 15 గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. రానున్న పుష్కరాల దృష్ట్యా మరో రూ.130 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకుల్లో రామచంద్రపురం నియోజకవర్గానికి 11వ స్థానం దక్కడం గర్వకారణమని, ఈ విజయంలో కూటమి నాయకులు, అధికారులు, ప్రజల సహకారం అమూల్యమైందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో కోటిపల్లి -ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి లక్ష్యంగా కృషి చేస్తానని మంత్రి సుభాష్ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ రాజు, డి ఈ శ్రీకాంత్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, గరికపాటి సూర్యనారాయణ, కొమరిన వీర్రాజు, కవలనానాజీ, దంగేటి గౌరీ శంకర్, జాస్తి విజయలక్ష్మి, బళ్ల లక్ష్మి, దొమ్మలపాటి విజయలక్ష్మి,నారపురెడ్డి బలరాం,గడి గోవిందు, అంకం శ్రీనివాస్, కొండేపూడి సురేష్, గుణ్ణం వినోద్, శ్రీహరి పంతులు, కొండ్రెడ్డి శీను, కూటమి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అరిగెల రంగయ్య వాలీబాల్ టోర్నమెంట్‌కు సర్వం సిద్ధం

**గ్రౌండ్ పనులను స్వయంగా పర్యవేక్షించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గొల్లవిల్లి గ్రామంలో ఫిబ్రవరి 15 నుండి 19వ తేదీ వరకు నిర్వహించనున్న అరిగెల రంగయ్య అల్ ఇండియా మెన్ అండ్ ఉమెన్ జాతీయ స్థాయి డే అండ్ నైట్ వాలీబాల్ టోర్నమెంట్ కు అన్ని ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ నిర్వహణలో భాగంగా గ్రౌండ్ పనులను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్వయంగా పరిశీలించి, అధికారులకు, నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అత్యుత్తమ పురుషులు, మహిళల వాలీబాల్ జట్లు పాల్గొననున్న ఈ మెగా క్రీడా వేడుకను అత్యంత వైభవోపేతంగా, క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని ఎమ్మెల్యే ఆనందరావు స్పష్టం చేశారు. గ్రౌండ్ లెవెలింగ్, గ్యాలరీల ఏర్పాటు, లైటింగ్ సదుపాయాలు, క్రీడాకారుల విశ్రాంతి గదులు, భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. క్రీడలను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా పేరుగాంచిన ఎమ్మెల్యే ఆనందరావు, గ్రామీణ యువతకు క్రీడలు క్రమశిక్షణతో కూడిన జీవన మార్గాన్ని చూపుతాయని పేర్కొన్నారు. ఇలాంటి జాతీయ స్థాయి పోటీలు గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించడం వల్ల యువతలో క్రీడలపై ఆసక్తి పెరుగుతుందని, ప్రతిభావంతులకు దేశ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అరిగెల రంగయ్య పేరుతో నిర్వహిస్తున్న ఈ వాలీబాల్ టోర్నమెంట్ గొల్లవిల్లి గ్రామానికి, అమలాపురం నియోజకవర్గానికి గర్వకారణంగా నిలవనుందని తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే ఈ పోటీలు క్రీడాభిమానులకు పండుగ వాతావరణాన్ని తీసుకువస్తాయని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆనందరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సహకారం, మార్గదర్శకత్వంతో టోర్నమెంట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జాతీయ స్థాయి క్రీడాకారుల రాకతో గొల్లవిల్లి గ్రామం ఐదు రోజుల పాటు క్రీడా కాంతులతో వెలిగిపోనుందని వారు పేర్కొన్నారు. మొత్తానికి, అరిగెల రంగయ్య అల్ ఇండియా వాలీబాల్ టోర్నమెంట్ విజయవంతం కావడానికి అన్ని విభాగాల సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగుతుండగా, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రత్యక్ష పర్యవేక్షణతో ఈ క్రీడా వేడుక మరింత ఘనంగా జరగనుందని క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### ఫిబ్రవరి 25 మాదిగల విజయోత్సవ సభను

## జయప్రదం చేయాలి

**యార్లగడ్డ రామకృష్ణ మాదిగ**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అమలాపురం నియోజకవర్గం, అల్లవరం మండలం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యార్లగడ్డ రామకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25న బాలయోగి స్టేడియంలో జరగబోయే మాదిగల విజయోత్సవ సభకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించనున్న ఈ విజయోత్సవ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ హాజరవుతుండటం గర్వకారణమని తెలిపారు. జిల్లాలోని మాదిగ సోదరులు, సోదరీమణులు చిన్నా-పెద్దా తేడా లేకుండా, పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో హాజరై రాజకీయంగా, సామాజికంగా బలోపేతం పొందేందుకు ఈ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు ముమ్మిడివరపు సుబ్బారావు మాదిగ, జిల్లా ఇన్‌చార్జ్ డాన్ సూరి మాదిగ, ఎంఎస్పీ అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుమర్తి మోహన్, చేట్ల సత్యనారాయణ, నవ్వుంద్రు నాగరాజు, నామడి నాగరాజు, జొన్నాడ చిట్టిబాబు, పెదపూడి వెంకట్రావు, బొమ్మి ఆనందరావుతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థికి, మహిళకు మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ. 15 వేలు ఆర్థిక సహాయం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఒక మహిళకు, చదువుకుంటూనే చిన్న వయసులోనే మ్యాజిక్ షోలు చేస్తూ ముందుకు సాగుతున్న విద్యార్థికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక సహాయం అందించారు. వివరాల్లోకి వెళితే రామచంద్రపురం పట్టణంలోని 28వ వార్డు చింతపల్లి నరసన్న నగర్ కు చెందిన అంగర కమల కుమారి అనే మహిళ తన భర్తను కోల్పోయి చిన్న పాపతో ఆర్థిక ఇబ్బందులు పడుతుంది. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ రూ. 10 వేలు చెక్కు ను ఆర్థిక సహాయంగా అందించారు. అలాగే అదే వీధిలోని ఎస్ ఐ జి మున్సిపల్ హైస్కూల్లో ఎనిమిదవ తరగతి చదువుతూనే మ్యాజిక్ షో నేర్చుకుని తన నైపుణ్యంతో అలరిస్తున్న పేద విద్యార్థి యార్లగడ్డ మోహన్ సత్య దీప్ ప్రతిభను తెలుసుకున్న మంత్రి విద్యార్థి సత్యదీప్ ను ప్రోత్సహిస్తూ రూ.5 వేలు చెక్కును అందించారు. నిత్యం పేదవారికి, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేస్తున్న మంత్రి సుభాష్ దయా గుణానికి, మానవత్వానికి పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గ్రూప్ 2 ఉద్యోగాల వేటలో

# శ్యామ్ ఇనిస్టిట్యూట్ ప్రభంజనం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ విద్యుత్ నగర్‌లో ఉన్న శ్యామ్ కోచింగ్ సెంటర్‌లో గ్రూప్-2 ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకున్న శ్యామ్ ఇనిస్ట్యూట్ విద్యార్థులకు అధిక సంఖ్యలో 92 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చిన సందర్భంగా ఆదివారం శ్యామ్ ఇనిస్ట్యూట్ అధినేత శ్యామ్ ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ పేరా భక్తుల రాజశేఖర్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే తనయుడు జనసేన యువనాయకుడు పంతం సందీప్ ముఖ్య అతిథురగా హాజరై గ్రూప్ టు ఉద్యోగాలు సాధించినటువంటి ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. శ్యామును, అధ్యాపకులను , అభినందించారు. అధినేత శ్యామ్ మాట్లాడుతూ 25 సంవత్సరాల కాలంలో 26 వేల పోస్టులను ఇప్పటివరకు సాధించడం జరిగిందని, ఇప్పటివరకు మా సంస్థ పోలీస్ ఉద్యోగాలకి పరిమితమైందని, మొదటిసారిగా గ్రూప్ టు విద్యార్థులకు కోచింగ్ ఇవ్వడం జరిగిందని, మొదటి ప్రయత్నంలోనే 92 పోస్టులను సాధించడం జరిగిందని, ఈ ఘనత సాధించడం చాలా సంతృప్తినిచ్చిందని వచ్చిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు వాళ్ల తల్లిదండ్రులతోటే సన్మాన కార్యక్రమం చేయించడం జరిగింది. వచ్చిన ప్రతి ఒక్కరూ శ్యామును అభినందించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన పిల్లి దంపతులు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన 7 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన సుమారు రూ.4 లక్షల విలువైన చెక్కులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడ రూరల్, కరప మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు తమ ద్వారా సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారని, అందులో 7 మందికి ఆర్థిక సహాయం మంజూరైందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తున్నారని, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలను ఆదుకోవడంలో సీఎం రిలీఫ్ ఫండ్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.నియోజకవర్గంలో సుమారు 54 వేల మంది టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనల్లో పార్టీ తరపున ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించామని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ కష్టకాలంలో అండగా నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, అలాగే మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పేరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి వీరభద్రరావు (బద్రి), క్లస్టర్ మిరపాల ప్రకాశ్, మాజీ కార్పొరేటర్ త్రిమూర్తులు, కో క్లస్టర్ టీడీపీ నాయకులు కొమరిశెట్టి నరసింగరావు, టీడీపీ నాయకులు పట్టాభి, పంపన కన్నరావు, యాసలపు విష్ణు, పిల్లి సత్తిబాబు, మల్లాడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పురుషుల విభాగంలో

# ప్రతిభ కనబరిచిన ఎపిటి విద్యార్థి పట్టాభిరామ్..




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల తిరుపతి ఎస్వి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన 28వ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్లో కాకినాడ జగన్నాథపురం ఆంధ్ర పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన మాధవరపు యువ సంతోష్ మణి పట్టాభిరామ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ విజేతగా విజయం సాధించారు. ఈ విజయం పట్ల కాలేజీ ప్రిన్సిపల్ వి ,విజయ్ కుమార్, పిడి బి .కిరణ్ కుమార్, హెచ్వోడి రామనారాయణ పట్టాభిరామ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడల వల్ల శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందని తద్వారా విద్యలో ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో తోటి విద్యార్థులు కాలేజీ సిబ్బంది రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన పట్టాభి రామ్ కు అభినందనలు తెలిపారు.

# 60 కుటుంబాలకు ఫుడ్ బాస్కెట్ల పంపిణీ



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామ పంచాయతీలో సెర్ప్, వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ కన్వర్జెన్సీలో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలు, వారి కుటుంబాలకు పోషకాహారాన్ని అందించేందుకు 60 కుటుం బాలకు ఫుడ్ బాస్కెట్లను మంగళవారం అందించారు. ఈ ఫుడ్ బాస్కెట్లో కందులు, మినుములు, రాగులు, పెసలు, కొర్రలు, బెల్లం, నూనె మొదలగు పోషకాహార దినుసులు, వస్తువులను సమకూర్చారు. ఒక్కొక్క బాస్కెట్ ఖరీదు రూ. 1,200 ఉండగా ఈ మొత్తాన్ని ఒక్కో వాయిదాకు రూ. 300 చొప్పున నాలుగు దఫాల్లో చెల్లించాలి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పథక సంచాలకులు డిఆర్డిఏ. జి.శ్రీనివాసరావు, డిపిఎం.హెచ్.డి. రాయ్, ఎ.పి.సి.ఎన్.ఎఫ్. మండల ఏవో. జోకా అమృత, మండల కోఆర్డినేటర్ వర్మ, ప్రకృతి వ్యవసాయ డిపిఎం. ఎలియాజర్ ప్రత్తిపాడు ఏపీఎం. జీ.శ్రీనివాసరావు, ఏలేశ్వరం ఏపీఎం. బి.శ్రీనివాసరావు, సిసి.సత్య ప్రసాద్, ఎ.పి.సి.ఎన్.ఎఫ్. సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వివోఏలు పాల్గొన్నారు.

# చిన్నారుల మిస్సింగ్ కేసులు.. 'సుప్రీం' కీలక ఆదేశాలు

**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** తప్పిపోయిన పిల్లల కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా చిన్నారుల అదృశ్యం ఘటనల వెనుక ఏదైనా నెట్‌వర్క్ హస్తం ఉందా? రాష్ట్రస్థాయిలో ఏవైనా ముఠాలు పనిచేస్తున్నాయా? అనేది గుర్తించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ ఘటనల వెనుక ఏదైనా వ్యవస్థీకృత ముఠా ఉందా?యాదృచ్ఛికంగా జరిగాయా? అనేది నిర్ధరించాలని సూచించింది. కిడ్నాపర్ల నుంచి రక్షించిన పిల్లలను ఇంటర్వ్యూ చేసి, వాటి వెనుక ఎటువంటి ముఠాలు ఉన్నాయో తెలుసుకోవాలని పేర్కొంది. ఈమేరకు అన్ని రాష్ట్రాల నుంచి డేటాను సేకరించాలని చెప్పింది. రాష్ట్రాల్లో పిల్లల మిస్సింగ్, అక్రమ రవాణాపై 'గురియా స్వయం సేవి సంస్థాన్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. కాగా కొన్ని రాష్ట్రాలు తప్పిపోయిన పిల్లల సమాచారం ఇస్తున్నాయని.. మరికొన్ని రాష్ట్రాలు మాత్రం ఈ డేటాను పంచుకోవడానికి నిరాకరిస్తున్నాయని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ.. అవసరమైతే సమాచారాన్ని అందించని రాష్ట్రాల విషయంలో కఠిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. ఈ విషయంలో కేంద్రానికి సహకరించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సమాచారాన్ని సేకరించడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన అధికారిని నియమించాలని సూచించింది. అదృశ్యమైన పిల్లల కేసులను పర్యవేక్షించడానికి మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న పోర్టల్‌లో అన్ని రాష్ట్రాల మిస్సింగ్ వివరాలను అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించింది.

# వ్యవసాయ రంగంలో 'ఉబరైజేషన్' కొత్త సంప్రదాయం...!

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆధునిక వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. రోజు రోజుకూ మరింత ఆధునికతను సంతరించుకుంటోంది. ఈ రంగంలో తాజాగా ఊబరైజేషన్ కొత్త సంప్రదాయానికి నాంది పలికారు. టాక్సీల కోసం మనం ఊబర్, ఓలా వంటి అనువర్తనాలను ఎలా వాడుతున్నామో, అలాగే రైతులు కూడా తమకు కావలసిన ట్రాక్టర్లు, డ్రోన్లు, పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు, వరి కోత యంత్రాలు (హార్వెస్టర్స్), డ్రోన్లు, స్ప్రేయర్లు వంటి ఆధునిక ఖరీదైన యంత్రాలను, యంత్ర పరికరాలను అద్దెకు బుకింగ్ చేసుకుని పొందే విధానం అమలులోకి వచ్చింది. ఈ విధానం వల్ల సామాన్య రైతులు లక్షలు, వేల రూపాయలు ఖర్చు పెట్టి యంత్రాలను కొనాల్సిన అవసరం లేకుండా, తక్కువ ధరకే వారి పొలం వద్దకే పరికరాలను తెప్పించు కోవచ్చు. ఇదంతా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కస్టమ్ హైరింగ్ సెంటర్లు




(సి.హెచ్.సి) - ఫార్మ్ మెషినరీ యాప్ ద్వారా రైతులు తమకు దగ్గరలో ఉన్న కస్టమ్ హైరింగ్ సెంటర్స్ నుండి యంత్రాలను బుక్ చేసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా రైతుకు 50 కిలోమీటర్ల పరిధిలో ఉన్న యంత్రాల వివరాలు, వాటి గంటకు లేదా ఎకరాకు అయ్యే అద్దె ధరలు ముందే తెలుస్తాయి. ఇలా ప్రభుత్వానివే కాకుండా జె ఫార్మ్స్, ట్రింకో మహీంద్రా వంటి ప్రైవేట్ యాప్‌లు కూడా రైతులకు 'ఊబరైజేషన్' సేవలను అందిస్తున్నాయి. ఊబరైజేషన్ వల్ల చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది, కూలీల కొరత సమస్య తీరుతుంది. సాగు సమయం ఆదా అవుతుంది. ఈ ఉబరైజేషన్ సేవల గురించి వివరించేందుకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం, తుని నియోజకవర్గం తొండంగి మండలాల వ్యవసాయ శాఖల సిబ్బందికి శంఖవరం మండలం అన్నవరంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్ కుమార్ మాట్లాడారు. రైతులు తమ పంటల సాగుకు కావాల్సిన యంత్ర పరికరాలను అద్దెకు ఇంటి వద్ద నుండే ఉబరైజేషన్ పద్ధతిలో బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. దీనిపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు. పంట నమోదు, ఈకేవైసీ, రైతుల రిజిస్ట్రేషన్, మట్టి నమూనాల సేకరణ ఆన్లైన్ వంటి అంశాలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో రెండు మండలాల వ్యవసాయ అధికారులు పద్మశ్రీ, పడాల గాంధీ, సిబ్బంది వెంకట లక్ష్మి, బి అశోక్, ఆర్.ఈశ్వర్, ఏఈఓ. సతీష్, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# ఓ సామాన్య వ్యక్తి రూ.50 లక్షల ఇంటిని కొనడం సాధ్యమేనా?



సామాన్య వ్యక్తికి రూ. 50 లక్షల ఇల్లు కొనడం సవాలు. ఈఎంఐ కచ్చితంగా జీతంలో 30 శాతం మించకూడదు. మరి అసలు ఎంత జీతం ఉంటే.. మనం రిలాక్స్‌గా ఇల్లు కొనుగోలు చేయగలం. ఆ విషయాలు ఈ స్టోరీలో తెలుసుకుందామా.. ఓ సారి లుక్కేయండి మరి. సాధారణంగా ఓ సామాన్య వ్యక్తికి ఇల్లు కొనడం అనేది తన జీవితకాలం కల. ఆ కలను నెరవేర్చుకునేందుకు కొందరు తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు. ఒకవేళ ఓ వ్యక్తి రూ. 80 వేలు ప్రతీ నెలా సంపాదిస్తుంటే.. అతడు రూ. 50 లక్షల ఇల్లు కొనుగోలు చేయగలడా.? హోం లోన్ ఈఎంఐ అనేది కచ్చితంగా జీతంలో 30 శాతం మించకూడదు. రూ. 40 లక్షల గృహ రుణానికి(రూ.50 లక్షల ఇంటిపై రూ. 10 లక్షల డౌన్‌పేమెంట్ తర్వాత) సుమారు రూ. 30,000 నుంచి రూ. 35,000 వరకు ఈఎంఐ అవుతుంది. మరి ఇంతటి మొత్తాన్ని మనం హ్యాపీగా భరించాలంటే కచ్చితంగా నెల జీతం రూ. 1.20 లక్షలు ఉండాలి. రూ. 80 వేలు జీతం ఉన్న వ్యక్తి.. ఇంతటి స్థాయిలో ఇల్లు కొనాలంటే.. ఆర్థిక ఒత్తిడి తప్పదు. ఇంటిని కొనుగోలు చేయాలనే తొందరలో లోన్స్ తీసుకోవద్దని.. 25 నుంచి 30 సంవత్సరాల పాటు రుణ భారం మోయడం కష్టంతో కూడుకున్న పని అని బిజినెస్ నిపుణులు అంటున్నారు. దీనికి బదులుగా పాసివ్ ఇన్‌కమ్‌పై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఉదాహరణకు, రూ. 50 లక్షలను 1 శాతం వడ్డీకి పెట్టుబడి పెడితే నెలకు రూ. 50,000 పాసివ్ ఇన్‌కమ్ వస్తుంది. ఈ ఆదాయం ఇంటి ఈఎంఐ లేదా అద్దెను సులభంగా కవర్ చేస్తుంది. ఉద్యోగం కోల్పోయినా ఆర్థిక భద్రతను అందిస్తుంది. అలాగే మ్యూచువల్ ఫండ్స్ లేదా ఆర్డీ లాంటి వాటిలో మొదటిగా ఎస్ఐపీలు స్టార్ట్ చేస్తే మంచిదని అంటున్నారు.

# కేవలం రూ.300కే గ్యాస్ సిలిండర్..

## ఈ ఒక్క పని చేస్తే చాలు.. అందరూ పొందే అవకాశం

ప్రముఖ ఆయిల్ కంపెనీ బీపీసీఎల్ కొత్త తరహా గ్యాస్ సిలిండర్లను మార్కెట్లోకి తెచ్చింది. ఈ ప్లాస్టిక్ సిలిండర్ల బరువు చాలా తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం గోవాలో వీటిని లాంచ్ చేయగా.. త్వరలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో పాటు దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానుంది. గ్యాస్ సిలిండర్ల రూపం భవిష్యత్తులో పూర్తిగా మారనుంది. ఇప్పటివరకు ఎల్పీజీ సిలిండర్లు అనగానే ఎరుపు రంగులో ఉండే ఇనుముతో తయారుచేసినవే మనకు గుర్తొచ్చాయి. పాతపడిపోయి, తప్పుబట్టి, మట్టి కొట్టుకుపోయి పోయి కనిపిస్తున్నాయి. ఇనుముతో తయారుచేసినవి కావడంతో ఈ గ్యాస్ సిలిండర్లు బాగా బరువుగా ఉంటాయి. వీటిని పక్కకి కదిలించాలన్నా లేదా పైకి ఎత్తి పట్టుకోవాలన్నా బరువుగా ఉండటం వల్ల కష్టమవుతుంది. కానీ గ్యాస్ సిలిండర్ల రూపంలో సరికొత్త విప్లవం త్వరలో రాబోతుంది. ఇక నుంచి అత్యంత తేలికగా ఉండే గ్యాస్ సిలిండర్లు రాబోతున్నాయి. అతి తక్కువ బరువు ఉండటంతో పాటు లుక్‌లో ఆకర్షణీయంగా ఉంటాయి. వీటిని మోడ్రన్ గ్యాస్ సిలిండర్లుగా పిలుస్తున్నారు.




### కంపోజిట్ ప్లాస్టిక్ సిలిండర్

మార్కెట్లోకి కొత్త సిలిండర్లు వచ్చేశాయి. హై డెన్సిటీ పాలిథిలిన్ అనే మోడ్రన్ మెటీరియల్‌తో తయారుచేసిన కొత్త రకం సిలిండర్లను ప్రముఖ గ్యాస్ సరఫరా సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రవేశపెట్టింది. భారత్ గ్యాస్ లైట్ పేరుతో వీటిని మార్కెట్లోకి లాంచ్ చేసింది. ఇవి గ్యాస్ ఫుల్‌గా నింపినా చాలా తక్కువ బరువుతో ఉంటాయి. గ్యాస్ నిండుగా నింపినా సరే ఈ సిలిండర్ బరువు కేవలం 15.9 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఇనుప సిలిండర్లతో పోలిస్తే వీటి బరువు సగానికి సగం తగ్గిపోతుంది. అలాగే గ్యాస్ సేఫ్టీ పరంగా ఇందులో అనేక ఫీచర్లు ఉన్నాయి. గ్యాస్ లీకైనా వెంటనే పేలిపోయే అవకాశం తక్కువగా ఉంటుంది. ఈ గ్యాస్ సిలిండర్ నెమ్మదిగా లీక్ అవ్వడం వల్ల ప్రెజర్ ఎక్కువగా ఉండదు.

### కేవలం రూ.300కే కొత్త సిలిండర్

పాత ఇనుప గ్యాస్ సిలిండర్లు 80 కిలోల ప్రెజర్ తట్టుకుంటాయి. కానీ ఈ కొత్త సిలిండర్లు 120 కిలోల ప్రెజర్ వరకు తట్టుకుంటాయి. ఇక సిలిండర్లు బ్లూ, ఎల్లో కలర్ రంగుల్లో ఉంటాయి. ఇక ఇందులో మరో మరోక ప్రత్యేకత ఏంటి అంటే.. గ్యాస్ లెవల్ ఎంత ఉందో సులువుగా చూసుకోవచ్చు. ఈ సిలిండర్‌కు ఒక కిటికీ లాంటిది ఉంటుంది. దాని నుంచి గ్యాస్ లెవల్ చెక్ చేసుకోవచ్చు. ఇక ఇనుప సిలిండర్లు వెంటనే తప్పు పట్టి పోతాయి. కానీ ఇవి ప్లాస్టిక్‌తో తయారు చేసినవి కావడంతో మరకలు, తుప్పు వంటి సమస్య ఉండనే ఉండదు. ఈ కొత్త సిలిండర్ అసలు ధర రూ.3,350గా ఉంది. కానీ పాత ఇనుప సిలిండర్ రిటర్న్ ఇచ్చేసి ఈ కొత్తది తీసుకోవాలంటే కేవలం రూ.300 మాత్రమే బీపీసీఎల్ వసూలు చేస్తోంది. ఈ మేరకు కస్టమర్లకు ఆఫర్ ప్రకటించింది.

# కొట్టినవారికి స్టేషన్ బెయిల్.. తిట్టినవారికి సెంట్రల్ జైలా...

**తిరుపతి ప్రసాదం గురించి సీఎం స్థాయి వ్యక్తి అలా మాట్లాడడం సరికాదు - చంద్రబాబు కొత్త అరాచకానికి నాంది పలికారు**

**ఇది మంచి పరిణామం ఐతే కాదు - అంబటి రాంబాబుతో ములాఖాత్ అనంతరం పాత్రికేయులతో మాట్లాడిన ఉండవల్లి**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తిట్టిన వాళ్లకి రాజమండ్రి సెంట్రల్ జైలు, కొట్టిన వాళ్లకి స్టేషన్ బెయిలు. మొత్తానికి చంద్రబాబు కొత్త ఒరవడి మొదలు పెట్టారు అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. సెంట్రల్ జైలులో రిమాండ్ లో ఉన్న మాజీ మంత్రి, వైసిపి సీనియర్ నాయకుడు అంబటి రాంబాబుతో మంగళవారం ఆయన ములాఖత్ అయ్యారు. మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ,మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాలతో కల్సి జైలు బయట మీడియాతో మాట్లాడారు. అంబటి రాంబాబు ఇంటిపై దాడికి వెళ్లడం, పెట్రోల్ బాంబ్స్ విసిరడం వంటివన్నీ టీవీల్లో మనందరం చూశామని ఆయన గుర్తుచేస్తూ, దాడులకు



దిగినవాళ్లకు స్టేషన్ బెయిల్ ఇచ్చేయడం దారుణం. కనీసం మేజిస్ట్రేట్ ముందు అయినా హాజరుపరిచినట్టు నటించి వున్నా బాగుండేది అని ఆయన అన్నారు. ఈ రకమైన సంప్రదాయం మంచిది కాదన్నారు. అంబటి రాంబాబు 1989లో ఎమ్మెల్యే గా ఎన్నికైనపుడు స్వర్గీయ జక్కంపూడి రామమోహనరావుతో సన్నిహతంగా ఉండేవారు. ఆ విధంగా నాకు కూడా మంచి అనుబంధం ఏర్పడి, కొనసాగుతూ వచ్చిందని, వ్యక్తిగత పరిచయంతోనే ములాఖాత్ కు వచ్చానని ఉండవల్లి చెప్పారు.

**తిరుమల లడ్డుపై ఉండవల్లి కీలక వ్యాఖ్యలు..**

కొవ్వు పదార్థాలు చాలా తక్కువగా ఉన్నాయని సిట్ నివేదిక 20వ పేజీలో స్పష్టంగా ఉందని ఉండవల్లి చదివి విన్పించారు. అయితే కానీ చంద్రబాబు పదేపదే జంతువుల కొవ్వు కలిసిందని మాట్లాడుతున్నారు. టాయిలెట్స్ కాడిగే లిక్విడ్ అని కూడా అంటున్నారు. తిరుపతి ప్రసాదం గురించి సీఎం స్థాయి వ్యక్తి అలా మాట్లాడడం సరికాదు. నిజానికి చంద్రబాబు ఎప్పుడూ బ్యాలెన్స్ తప్పి మాట్లాడరు. కానీ తిరుమల లడ్డూ విషయంలో ఎందుకు అలా మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదు. ఇలాంటి వ్యాఖ్యలు దైవ ద్రోహం అవుతుంది. హిందూ పార్టీ అని చెప్పే బీజేపీ వాళ్లు కూడా చంద్రబాబులా మాట్లాడటం లేదు. ఇప్పటికైనా చంద్రబాబు పునరాలోచించాలి. ఒకవేళ ఏదైనా జరిగివుంటే, శిక్షించండి అంతేకానీ పదేపదే వినడానికే ఇబ్బందిగా ఉండే మాటలు మాట్లాడ్డం మంచిది కాదు' అని ఉండవల్లి పేర్కొన్నారు.

# పెన్షనర్ల సంక్షేమమే లక్ష్యంగా కృషి

**11న ఎస్‌బిఐ పెన్షనర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం - జయప్రదం చేయాలంటూ విజ్ఞప్తి**

**మీడియా సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.ఎస్ రామచంద్రరావు, పిఎస్‌విఎస్ శర్మ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెన్షనర్ల అసోసియేషన్ ఐదవ సర్వసభ్య సమావేశం ఈ నెల 11వ తేదీన రాజమండ్రిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు అమరావతి సర్కిల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.ఎస్.రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.వి.ఎస్.శర్మ తెలిపారు. మంగళవారం రాజమండ్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాజమండ్రి మోరంపూడిలో ఉన్న బి.ఆర్.కె గార్డెన్స్‌లో బుధవారం జరిగే సమావేశంలో పలువురు ప్రముఖులు, అసోసియేషన్ ప్రతినిధులు హాజరవుతున్నట్లు చెప్పారు.1983లో ఎస్‌ఎన్ మారుతి వంటి ప్రముఖుల నెలకొల్పబడిన ఈ అసోసియేషన్ పెన్షనర్ల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తోందని తెలిపారు. కాగా 2022 సంవత్సరంలో కార్పొరేట్ సెంటర్ ద్వారా పాలనా సౌలభ్యం, ప్రజల అవసరాల కోసం అమరావతి సర్కిల్ తో సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఈ సర్కిల్ పరిధిలో ఉన్న తమ సంఘం శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు ఉన్న ఉమ్మడి 13 జిల్లాల నుంచి 11 వేల మంది సభ్యులతో విజయవంతంగా నడుస్తోందన్నారు. వృద్ధులకు, పేదలకు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా విజయవాడ వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి తమ సంఘం తరఫున రూ. 20 లక్షలను అందచేసినట్లు తెలిపారు. పెన్షనర్ల కు ఎదురవుతున్న సమస్యలను కూడా ఎప్పటికప్పుడు పోరాడుతున్నట్లు వివరించారు. కాగా బుధవారం రాజమండ్రిలో జరుగుతున్న ఎస్‌బిఐ పెన్షనర్ల అసోసియేషన్ అమరావతి సర్కిల్ సర్వసభ్య సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుండి దాదాపు 1000 మంది సభ్యులు హాజరవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా సమావేశానికి సంఘం నుండి జాతీయ స్థాయి నాయకులు, ఆఫీసర్స్, అసోసియేషన్ నాయకులు, అవార్డు సిబ్బంది యూనియన్ నాయకులు, సర్కిల్ పరిపాలనా నిర్వహణ అధికారులు కూడా పాల్గొంటారన్నారని, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాబాయ్ పంతులు, సి.హెచ్.వెంకటేశ్వర్లు, ప్రతినిధులు బి.జార్జి ఆంటోని, వామనమూర్తి, మోహన్ దాస్,రిసెప్షన్ కమిటీ చైర్మన్ డి.ఆదివిష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకి


# కూటమి ప్రభుత్వం చర్యలు : ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గ వ్యాప్తంగా సమస్యలు రహిత విద్యుత్ సరఫరా లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. నాణ్యమైన విద్యుత్తును ప్రజలకు అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ వ్యవస్థలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని అన్నారు.మండపేట గాంధీనగర్ రైతు బజార్ దగ్గరలో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను మంగళ వారం మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో 43 గ్రామాల్లో, పట్టణంలోని 30 వార్డులలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ట్రూ అప్ చార్జ్ లు ఇతర చార్జీలు తో ప్రజలు ఇబ్బంది పడేవారని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ట్రూ అప్ కాదు ట్రూ డౌన్ అంటూ 13 పైసలు తగ్గించడం జరిగిందని పేర్కొన్నారు. దీనిని రూపాయి 30 పైసల వరకు తగ్గించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారని ఆయన అన్నారు. పట్టణంలో 18 ట్రాన్స్ఫార్మర్లు, 132 నూతన విద్యుత్ స్తంభాలు, వాటర్ వర్క్స్ లో ఏర్పాటు చేసిన నూతన సబ్ స్టేషన్ తో కలిపి నియోజకవర్గంలో 15 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. గృహ వినియోగదారులకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చొల్లంగి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎక్కడా లో వోల్టేజ్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత సంవత్సరం వేసవిలో ఎక్కడైతే లో వోల్టేజ్ సమస్యలు వచ్చాయో ఆయా చోట్ల ఇప్పుడు అవి లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. పట్టణంలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే వినియోగదారులు తమకు వెంటనే తెలియజేయాలని శ్రీధర్ కోరారు. టోల్ ఫ్రీ నెంబర్ 1912 కి కాల్ చేసి విద్యుత్ సమస్యలను తెలియజేయవచ్చునీ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ మేరావత్ ముని, లైన్ ఇన్స్పెక్టర్ కటికదల శ్రీనివాస్, లైన్ మెన్ కరసాల నరసింహారాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిల్లంక బ్రిడ్జి లాకుల్లో

# పేరుకుపోయిన చెత్తాచెదారం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామంలో ఉన్న బ్రిడ్జి వద్ద లాకుల్లో భారీ స్థాయిలో చెత్తా చెదారం పేరుకుపోయింది. గోదావరి ప్రభావం తక్కువగా ఉన్నప్పుడే ఈ చెత్తను తీసివేస్తే లాకులు రాబోయే వర్షాకాలంలో సులువుగా తెరవబడతాయి. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల లాకుల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పూర్తిస్థాయిలో గోదావరి నీరు వర్షాకాలంలో ఈ లాకులు గుండా వెళ్లకుండా ఆటంకం ఏర్పడి పురుషోత్తపట్నం నుండి సీతానగరం మండలం, కోరుకొండ మండలాల్లో నీరు గ్రామాలలో చేరి ప్రజలు ఇబ్బందులు పడక తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి లాకులలో ఉన్న చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇటీవల హాస్పటల్స్‌లో వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కొరకు ముఖ్యమంత్రి సహాయనిధికి ధరఖాస్తు చేసుకున్న 17 మందికి రూ.11,61,729/-లు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు కాగా చెక్కులను మంగళవారం మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితర్లు పాల్గొన్నారు.

# పీఎంపీలచే వృద్ధులకు అన్నదానం



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ (ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం బొమ్మూరు శ్రీవివేకానంద మహారోగ ఆరోగ్య కేంద్రం నందు వృద్ధులకు అన్నదానం చేసారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జిల్లా కార్యదర్శి పి దేవానందం, జిల్లా కోశాధికారి పి చిన్ని,మండల అధ్యక్షులు రహమాన్ ఖాన్, కార్యదర్శి మట్టా రమేష్,డి సాయిరామారెడ్డి,ఎమ్ చిట్టిబాబు,జి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హౌస్ బోటింగ్, జల క్రీడల

# ప్రాజెక్టులు వేగవంతం చేయాలి

**మూడు నెలల్లో పర్యాటకులకు అందుబాటులోకి ఉండాలి : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు పరిధిలో గోదావరి నది తీర ప్రాంతాలు, హౌస్ బోటింగ్, కడియం నర్సరీ ఆధారిత పర్యాటక అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదిత ప్రాజెక్టు పనులను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారులతో పాటు బోట్ వెండర్స్, హౌస్ బోటింగ్ ఆపరేటర్లు, ఎకో స్పోర్ట్స్ నిర్వాహకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని రాబోయే మూడు నెలల్లో పర్యాటకులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హౌస్ బోటింగ్, జల క్రీడల కార్యకలాపాలకు సంబంధించిన బోటు డ్రైవర్లకు నైపుణ్య శిక్షణ, ధృవీకరణ, లైసెన్సింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకు అవసరమైన అన్ని అనుమతులను జిల్లా యంత్రాంగం తరపున సమన్వయంతో పూర్తి చేస్తామని వెల్లడించారు. పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక వనరులను తప్పనిసరిగా వినియోగంలోకి తీసుకురావాలని, అనుమతుల కోసం కాలయాపన చేయకుండా పనులు క్షేత్రస్థాయిలో ముందుకు సాగాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో రీజినల్ డైరెక్టర్ ఎన్.వి.వి.ఎస్. మూర్తి, జిల్లా టూరిజం అధికారి పి. వెంకటాచలం, డివిఎం పవన్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ భాస్కర్ రెడ్డి, బోట్ వెండర్స్,హౌస్ బోటింగ్ ఆపరేటర్లు, ఎకో స్పోర్ట్స్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానంతో భార్య మృతికి కారణమైన వ్యక్తి అరెస్ట్

**మండపేట రూరల్ సిఐ పి.దొర రాజు**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** భార్య పై అనుమానంతో వేదింపులకు పాల్పడి, ఆత్మహత్య చేసుకునేలా ప్రేరిపించిన వ్యక్తి పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు మండపేట రూరల్ సిఐ పి.దొరరాజు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపిన వివరాల మేరకు తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం, సోమేశ్వరం గ్రామానికి చెందిన పాకలపాటి మహేష్ అలియాస్ పండు, భార్య పాకలపాటి వీర వెంకటలక్ష్మీ దుర్గలకు ఇద్దరు పిల్లలు కాగా జనవరి 9 వ తేదీన రాత్రి సమయంలో భార్య ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతోందనే అనుమానంతో ఆమెతో గొడవపడి, నీవు చస్తే నాకు దరిద్రం పోతది అని తిట్టి, ఆమె వద్ద నుండి సెల్ ఫోన్ తీసేసుకోవడంతో మనస్థాపానికి గురైన వెంకటలక్ష్మి మరుసటి రోజు జనవరి 10 ఉదయం 6 గంటల సమయంలో ఇంట్లో చున్నీ తో ఫ్యాన్ కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని మరణించిందని, ఈ ఘటనపై రాయవరం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కాగా దర్యాప్తు చేపట్టి మంగళవారం నిందితుడు పాకలపాటి మహేష్ అలియాస్ పండు ను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్ట్ కి తరలించినట్లు మండపేట రూరల్ సిఐ పి దొరరాజు తెలిపారు.

# 50వ వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క 50 వార్డులోనే రూ 4 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. ఇప్పటికే ఒక కోటి 10 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిచేసుకున్నామని ఆయన అన్నారు. స్థానిక 50 వార్డులో రూ. 57 లక్షల పనులను ఎమ్మెల్యే వాసు జనసేన పార్టీ నగర ఇంచార్జ్ అత్తి సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. కోటి 90 లక్షల పనులకు శంకుస్థాపన చేయగా, అవి కూడా పనులు మొదలయ్యాయని తెలిపారు. ఈరోజు రూ. 57 లక్షలతో పాటు మరొక రూ. 5 లక్షల 60 వేలు వెరసి రూ. 62 లక్షల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించుకున్నామని ఆయన చెప్పారు. రూ. 29 లక్షల పనులు టెండర్ దశలో ఉన్నాయని ఎమ్మెల్యే వాసు చెప్పారు. మొత్తంగా రూ. 4 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలను ఈ వార్డులో చేసుకుంటున్నామన్నారు. ఇది కాకుండా రోడ్లు, డ్రైన్స్ రూపంలో ప్రజలకు అవసరమైన రూ.14 కోట్ల 93 లక్షల రూపాయల పనులు చేపట్టాల్సి ఉందన్నారు. అవి కూడా పుష్కర పనుల్లో పెట్టామని, అన్ని వార్డుల్లో పుష్కర పనుల కింద పెట్టిన పనులు ఈ ఏడాది పూర్తిచేస్తామని ఎమ్మెల్యే వాసు వివరించారు. వందల కోట్ల ఆస్తిని సమాజ హితం కోసం ధారాదత్తం



చేసిన నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం జన్మ గృహాన్ని సందర్శించినప్పుడు అక్కడి దుస్థితి చూసి చాలా బాధ కల్గిందన్నారు. వైకాపా వాళ్లు తీరు తిరుపతి లడ్డూ వ్యవహారంలో చూశామని అన్నారు. నేషనల్ మీడియా పళ్ళు రాలగొట్టేలా ఈ విషయంలో చెబుతుంటే, దీనికి కారకులెవరో వైవి సుబ్బారెడ్డి చెబుతుంటే, ఇంకా సిగ్గులేకుండా వైసిపి వాళ్ళు సమర్ధించుకుంటున్నారని ఎమ్మెల్యే వాసు విమర్శించారు. గతంలో వైసిపి తరుపున ఎంపీగా నెగ్గిన వ్యక్తి సొంతవార్డు లో ఉన్న వీరేశలింగం గృహం గురించి పట్టించుకోకపోవడం శోచనీయమని ఎమ్మెల్యే వాసు ఆయన విమర్శించారు. ఎంతసేపు నేను లేని రాజమండ్రి అని చెప్పుకోవడం తప్ప ఏముందని ఆయన ఎద్దేవా చేసారు. నువ్వు లేని రాజమండ్రికి ఖేల్ ఇండియా నుంచి స్టేడియం కి రూ. 14 కోట్ల నిధులు వచ్చాయి, రివర్ ఫ్రెంట్ పనులు జరుగుతున్నాయి, ఈ 20 నెలల్లో రూ. 200 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అని ఆయన అన్నారు. వీరేశలింగం జన్మగృహానికి ఎంపీ పురందేశ్వరి రూ. 50 లక్షలు ఎంపీ లాడ్స్ నుంచి కేటాయించగా, మరో రూ. 50 లక్షల నిధులు కూడా జోడించి మరమ్మత్తులు చేస్తున్నామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఆదిలోనే చూసుకుని ఉంటే ఇంతపెద్ద పనిపడేది కాదన్నారు. పోలవరంలో చేసిన తప్పే అన్నిచోట్లా చేసుకుంటూ వచ్చారని ఆయన విమర్శించారు. ఇవన్నీ ఎందుకంటే వైసిపి వాళ్ళ విధ్వంస కర పనులు, కూటమి ప్రభుత్వ ఆలోచనలు ప్రజలకు తెలియాలని చెబుతున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్, 50వార్డు టిడిపి ఇంచార్జి మరుకుర్తి రవియాదవ్, నాయకులు చింతపల్లి నాని, హరిబెనర్జి, బుడ్డిగ రవి, ఉప్పులూరి జానకిరామయ్య, శెట్టి జగదీష్, చాపల చిన్న రాజు, సలాది ఆనంద్, కవులూరి వెంకట రావు, తదితరులు పాల్గొన్నారు.

# రేపే కార్మిక సమ్మెను జయప్రదం చెయ్యండి

**పేపర్ మిల్లు గేట్ మీటింగ్‌లో ఉమామహేశ్వరరావు పిలుపు**




**రాజామహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రేపటి కార్మిక సమ్మెను జయప్రదం చెయ్యాలని ఆంధ్రా పేపర్ మిల్లు గేట్ మీటింగ్‌లో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్ వల్ల కార్మికులు హక్కులు కోల్పోతున్నారని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ తెచ్చి రద్దు చేశారని అన్నారు. కార్మికుల హక్కుల కోసం జరిగే సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చెయ్యాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు నల్లా రామారావు మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉండి హక్కులు కాపాడుకోవాలని అన్నారు. ఈ గేట్ మీటింగ్ లో సిఐటియు జిల్లా ప్రధాన బి. పవన్, పేపర్ మిల్లు సిఐటియు యూనియన్ గౌరవ అధ్యక్షులు టి అరుణ్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ రాంబాబు, కొండలరావు, రామారావు, పేపర్ మిల్లు యూనియన్ నాయకులు రాజేష్, ఎం కృష్ణ, నాయుడు, డి సత్యనారాయణ, జి ఏ రామారావు, ఏవివి శ్రీనివాస్,11 పేపర్ మిల్లు యూనియన్ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత ప్రతివక్కరి బాధ్యత : దాలిపర్తి వేమన

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం ఉదయం " స్వచ్ఛ భారత్ అభియాన్" లో భాగంగా రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది చే కోటిలింగాలరేవు వద్ద నిర్వహించబడిన "స్వచ్ఛ ఉత్సవ్" కార్యక్రమంలో కుమ్మర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన పాల్గొని కోటిలింగాల రేవు వద్ద ఘాట్ ను శుభ్రపరచుటలో కార్పొరేషన్ సిబ్బందితో పాటు "శ్రమదానం"చేశారు. ఈ సందర్భంగా దాలిపర్తి వేమన మాట్లాడుతూ 2014 సంవత్సరంలో భారత ప్రభుత్వం మొదలుపెట్టిన "స్వచ్ఛ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం 15 రోజుల నుండి 30 రోజులు వరకు ప్రతి గ్రామంలోనూ, పట్టణంలోనూ, కార్పొరేషన్ లోను స్వచ్ఛ ఉత్సవాలు ప్రభుత్వం నిర్వహిస్తుందని, దానిలో భాగంగా ఫిబ్రవరి 6వ తేదీ నుండి మార్చి 6వ తేదీ వరకు స్వచ్ఛ ఉత్సవాలు లో భాగంగా ప్రతివారు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రం చేసుకోవలసిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన ప్రకృతి ప్రశాంతంగా ఉండి, ప్రజలు ఆరోగ్యవంతంగా జీవిస్తారని, అందువలన "రాష్ట్ర మరియు దేశ ఆర్థిక అభివృద్ధి బాగుంటుందని", కనుక ప్రతివారు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఈ స్వచ్ఛ ఉత్సవాలలో ప్రతి పౌరుడు పాల్గొనాలని, ఈ సందర్భంగా దాలిపర్తి వేమన పిలుపునిచ్చారు.





### రెమ్యునరేషన్ తీసుకోకుండా మిల్కీ బ్యూటీ

# తమన్నా చేసిన సినిమా ఏదో తెలుసా?

సినీ ఇండస్ట్రీలో ఒక్క హిట్ పడితే చాలు.. హీరోల రెమ్యునరేషన్ ఆకాశాన్ని తాకుతుంది. సెకన్ల పాటు కనిపించే అతిథి పాత్రలకు కూడా కోట్ల రూపాయలు డిమాండ్ చేసే రోజులివి. కానీ ఇప్పుడు ఒక యంగ్ స్టార్ హీరో మాత్రం తను ఇచ్చిన మాట కోసం ఏకంగా తన పారితోషికాన్ని వదులుకున్నారు. సినీ ఇండస్ట్రీలో ఒక్క హిట్ పడితే చాలు.. హీరోల రెమ్యునరేషన్ ఆకాశాన్ని తాకుతుంది. సెకన్ల పాటు కనిపించే అతిథి పాత్రలకు కూడా కోట్ల రూపాయలు డిమాండ్ చేసే రోజులివి. కానీ ఇప్పుడు ఒక యంగ్ స్టార్ హీరో మాత్రం తను ఇచ్చిన మాట కోసం ఏకంగా తన పారితోషికాన్ని వదులుకున్నారు. స్టార్‌డమ్ వచ్చాక కూడా పాత బాకీ తీర్చుకోవడానికి ఆయన చేసిన పని ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. కేవలం ఆయన మాత్రమే కాదు, మన సౌత్ స్టార్ హీరోయిన్ కూడా ఒక రూపాయి తీసుకోకుండానే ఆ సినిమాలో నటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ వాలంటైన్స్ డే కానుకగా రాబోతున్న ఒక భారీ బాలీవుడ్ సినిమాలో చోటు చేసుకున్న ఈ ఆసక్తికర పరిణామం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ అగ్ర దర్శకుడిపై ఉన్న గౌరవంతో ఈ తారలు చేసిన ఆ సాహసమేంటి?

**వాలంటైన్స్ డే స్పెషల్**

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బాలీవుడ్‌లో 'ఓ రోమియో' అనే వైవిధ్యమైన ప్రేమకథా సినిమా సిద్ధమైంది. అగ్ర దర్శకుడు విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో షాహిద్ కపూర్, తృప్తి డిమ్రి ప్రధాన పాత్రలు పోషించారు. ఫిబ్రవరి 14కు ఒక రోజు ముందుగా, అంటే ఫిబ్రవరి 13న ఈ సినిమా థియేటర్లలోకి రాబోతోంది. షాహిద్ కపూర్ మార్కు స్టయిల్, తృప్తి డిమ్రి గ్లామర్ ఈ సినిమాకు మెయిన్ ఎట్రాక్షన్ కానుంది. అయితే ఈ సినిమాలో విక్రాంత్ మాస్సే, దిశా పటానీ, తమన్నా భాటియా, నానా పటేకర్ వంటి హేమాహేమీలు కీలక పాత్రల్లో కనిపించనుండటం విశేషం.

**మాట నిలబెట్టుకున్న విక్రాంత్ మాస్సే..**

ఈ సినిమాలో నటించిన విక్రాంత్ మాస్సే గురించి దర్శకుడు విశాల్ భరద్వాజ్ ఒక ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. '12వ ఫెయిల్' సినిమాతో నేషనల్ లెవల్ స్టార్‌గా ఎదగకముందే విక్రాంత్ ఈ ప్రాజెక్టుకు ఓకే చెప్పారు. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయ్యాక విక్రాంత్ రేంజ్ మారిపోయింది. కానీ విశాల్ భరద్వాజ్ ను కలిసినప్పుడు, విక్రాంత్ తను ఇచ్చిన మాట మీద నిలబడ్డారు. అంతేకాదు, ఈ సినిమా కోసం తాను ఒక్క రూపాయి కూడా పారితోషికం తీసుకోనని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. విశాల్ భరద్వాజ్ గతంలో తీసిన 'మఖ్బూల్' చూసి తాను ఇండస్ట్రీలోకి వచ్చానని, ఆ సినిమా తన జీవితాన్ని మార్చేసిందని.. అందుకే ఈ సినిమాలో ఉచితంగా నటించడం ఒక బహుమతిగా భావిస్తున్నానని విక్రాంత్ పేర్కొన్నారట. విక్రాంత్ మాస్సే మాత్రమే కాదు, మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా కూడా ఈ సినిమా కోసం ఎటువంటి పారితోషికం తీసుకోలేదట. సినిమాలో తమన్నా పాత్ర నిడివి తక్కువగా ఉన్నప్పటికీ, కథ మలుపు తిరగడంలో ఆ పాత్రే అత్యంత కీలకం అని దర్శకుడు తెలిపారు. తమన్నా దాదాపు 12 రోజుల పాటు షూటింగ్ కు రావడమే కాకుండా, పక్కాగా రిహార్సల్స్ కు కూడా హాజరై తన వృత్తినిబద్ధతను చాటుకుంది. తనపై గౌరవంతో ఈ ఇద్దరు నటులు ఉచితంగా పనిచేయడం విశాల్ భరద్వాజ్ ను ఎంతో ప్రభావితం చేసింది. షాహిద్ కపూర్, తృప్తి డిమ్రి లీడ్ రోల్స్ లో కనిపిస్తుండగా, విక్రాంత్ మాస్సే పాత్ర సుమారు 9 రోజుల పాటు షూటింగ్ లో పాల్గొనేంత నిడివి కలిగి ఉందట. దిశా పటానీ, నానా పటేకర్ వంటి వారు ఉండటంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. విశాల్ భరద్వాజ్ సినిమాలంటేనే ఒక గాఢత, బలమైన భావోద్వేగాలు ఉంటాయి.

సినీ వాయిస్ CINEMA

# మార్కెట్‌కి మించిన బడ్జెట్‌లు..

### టాలీవుడ్ నిర్మాతల డేరింగ్ స్టెప్.. ఈ రిస్క్ వర్కవుట్ అవుతుందా..?




ప్రస్తుతం భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమాల ట్రెండ్ కొనసాగుతుంది. కథతో సంబంధమే లేకుండా కోట్లు ఖర్చు చేసి మరీ మూవీస్ నిర్మిస్తున్నారు మేకర్స్. స్టార్ హీరోస్ కోసం రిస్క్ చేస్తున్నారు. మీడియం రేంజ్ హీరోలకు కూడా వంద కోట్ల సినిమాలు తలుపు తడుతున్నాయి. పాన్ ఇండియా అనే పదం వచ్చాకా.. కథను, మేకింగ్ ను నమ్మి నిర్మాతు ఇప్పుడు పెట్టుబడి విషయంలో సాహసం చేస్తున్నారు. బాహుబలి తర్వాత టాలీవుడ్ బాక్సాఫీస్ లెక్కలు, బడ్జెట్ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు కేవలం టైర్-1 స్టార్ హీరోలకు మాత్రమే పరిమితమైన వంద కోట్ల బడ్జెట్‌లు.. ఇప్పుడు మీడియం రేంజ్ హీరోల తలుపు తడుతున్నాయి. పాన్ ఇండియా అనే పదం వచ్చాక కథను, మేకింగ్‌ను నమ్మి నిర్మాతలు చేస్తున్న సాహసం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే హీరోల గత సినిమాల కలెక్షన్స్, వాళ్ళ ప్రస్తుత మార్కెట్ స్టామినాను పక్కనపెట్టి.. కేవలం కంటెంట్‌ని నమ్మి ఇంత భారీ మొత్తం ఖర్చు చేయడం అనేది కత్తి మీద సాములాంటిదే. ముఖ్యంగా చాలా మంది మీడియం రేంజ్ హీరోల సినిమాల బడ్జెట్స్ చూస్తుంటే కళ్లు బైర్లు గమ్మేస్తున్నాయి. అసలే ధైర్యంతో వీళ్లింత రిస్క్ తీసుకుంటున్నారో అంటూ ముక్కున వేలేసుకోవాల్సిందే. మరీ ముఖ్యంగా నేచురల్ స్టార్ నాని, రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ సినిమాల బడ్జెట్‌లు చూస్తే కళ్లు చెదిరేలా ఉన్నాయి. నాని కెరీర్‌లో హైయెస్ట్ కలెక్షన్స్ రాబట్టిన హిట్ 3 సుమారు 69 కోట్ల షేర్ సాధించగా.. ఆయన నెక్స్ట్ చేస్తున్న ది ప్యారడైజ్ సినిమాకు ఏకంగా 150 కోట్లు, సుజీత్ సినిమాకు 130 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అయితే వీటికి నాన్ థియెట్రికల్ బిజినెస్ కూడా అలాగే జరుగుతుంది. అలాగే విజయ్ దేవరకొండ ట్రాక్ రికార్డ్ చూస్తే గీతగోవిందం 70 కోట్ల షేర్‌తో టాప్‌లో ఉంది. కానీ ఇప్పుడు ఆయన చేస్తున్న రణబాలి సినిమాకు 120 కోట్లు, రౌడీ జనార్ధనకు 75 కోట్లు బడ్జెట్ పెడుతున్నారు. వీళ్ళ మార్కెట్ పరిధికి దాదాపు రెట్టింపు బడ్జెట్‌తో సినిమాలు తెరకెక్కుతుండటం గమనార్హం. ఇక సాయి ధరమ్ తేజ్, నాగచైతన్య, నిఖిల్ వంటి హీరోల విషయంలో నిర్మాతలు చేస్తున్న ప్రయోగం మరింత ఆశ్చర్యకరంగా ఉంది. సాయి ధరమ్ తేజ్ విరూపాక్షతో 50 కోట్ల షేర్ మార్క్ టచ్ చేయగా.. ఇప్పుడు సంబరాల ఏటిగట్టు కోసం ఏకంగా 125 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ సినిమాను కొత్త దర్శకుడు రోహిత్ తెరకెక్కిస్తున్నాడు. నాగచైతన్య తండేల్ 52 కోట్ల షేర్ రాబడితే.. సెట్స్‌పై ఉన్న వృషకర్మ కోసం 110 కోట్లు పెడుతున్నారు.

క్రీడా వాయిస్

# ఆతిథ్య జట్టుకు భారీ షాక్..

## టోర్నమెంట్ నుంచి స్టార్ ఆల్ రౌండర్ ఔట్.. ఎందుకంటే?




టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభంలో ఆతిథ్య జట్టు శ్రీలంకకు బిగ్ షాక్ ఎదురైంది. లంక స్టార్ ఆటగాళ్ళలో ఒకరు గాయం కారణంగా టోర్నమెంట్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. తొలి మ్యాచ్ లోనే ఇలా షాక్ తగలడంతో లంక జట్టు ఇబ్బందుల్లో పడింది. టీ20 ప్రపంచ కప్ 2026 గ్రాండ్ గా మొదలైంది. అభిమానులకు ఒకదాని తర్వాత ఒకటి ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు కనిపిస్తున్నాయి. ఈ ఉత్కంఠ మధ్య ఆతిథ్య శ్రీలంక జట్టు టోర్నమెంట్ ప్రారంభ దశలోనే భారీ ఎదురుదెబ్బ తగిలింది. టీ20 ప్రపంచ కప్ 2026కి సహ - ఆతిథ్యమిచ్చిన శ్రీలంకకు చెందిన ఒక స్టార్ ఆటగాడు గాయం కారణంగా మొత్తం టోర్నమెంట్ నుంచి తప్పుకున్నాడు. ఈ ఆటగాడు మొదటి మ్యాచ్ సమయంలో గాయంతో బాధపడడం గమనార్హం. గాయం ఉన్నప్పటికీ, అతను విజయంలో కీలక పాత్ర పోషించాడు. శ్రీలంక క్రికెట్ జట్టుకు చేదు వార్త వచ్చింది. స్టార్ ఆల్ రౌండర్ వానిందు హసరంగా తీవ్రమైన తొడ కండరాల గాయం కారణంగా టోర్నమెంట్ నుంచి వైదొలిగాడు. మంగళవారం జరిగిన ఎంఆర్‌ఐ స్కాన్‌లో గాయం నిర్ధారణ అయింది. అతని తొడ కండరాలలో తీవ్రమైన చీలిక కనిపించింది. ఐర్లాండ్‌తో జరిగిన టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్‌లో హసరంగా గాయం బారిన పడ్డాడు. ఆ మ్యాచ్‌లో అతను అద్భుతంగా రాణించాడు. 3 వికెట్లు తీసుకున్నాడు. కానీ, బౌలింగ్ చేస్తున్నప్పుడు అతనికి అసౌకర్యంగా అనిపించింది. హసరంగా గతంలో తొడ కండరాల గాయాలతో బాధపడ్డాడు. ఈసారి గాయం చాలా తీవ్రంగా ఉంది. దీంతో టోర్నమెంట్ నుంచి తప్పుకున్నాడు. హసరంగా లంక జట్టులో కీలకమైన స్పిన్నర్, బ్యాటింగ్ ఆల్ రౌండర్. కాబట్టి శ్రీలంకకు ఇది భారీ దెబ్బేనని భావిస్తున్నారు. స్వదేశంలో స్పిన్ అనుకూల పిచ్‌లపై జట్టు ఆశలు పెట్టుకోవడంలో అతను కీలక పాత్ర పోషించాడు. ఐర్లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో శ్రీలంక 20 పరుగుల తేడాతో గెలవడానికి అతని బౌలింగ్ సహాయపడింది. కానీ, ఇప్పుడు అతను లేకుండానే జట్టు ముందుకు సాగాల్సి ఉంటుంది. టీ20 ప్రపంచ కప్‌లో శ్రీలంక తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ కూడా వనిందు హసరంగా. శ్రీలంక జట్టు హసరంగా స్థానంలో లెగ్-స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ దుషన్ హేమంతను జట్టులోకి తీసుకుంటుంది. లెగ్-స్పిన్నర్, ఆల్ రౌండర్‌గా ఆడగల సామర్థ్యం ఉన్న హేమంత జట్టుకు విలువైన ఆటగాడు కావొచ్చు. ఐసీసీ నిబంధనల ప్రకారం, గాయాల భర్తీకి అధికారిక అనుమతి అవసరం. ఒకసారి భర్తీ చేసిన తర్వాత ఆటగాళ్ళు తిరిగి జట్టులోకి రాలేరు.

# టీమిండియాకు మరో బ్యాడ్‌న్యూస్.. రెండో మ్యాచ్ నుంచి అభిషేక్ శర్మ ఔట్..?




టీ20 ప్రపంచ కప్ లో భాగంగా ఫిబ్రవరి 12న ఢిల్లీలో భారత్, నమీబియా మధ్య కీలక మ్యాచ్ జరగనుంది. అయితే, ఈ మ్యాచ్ కు అభిషేక్ శర్మ ఫిట్ గా లేకపోవడంతో ఆందోళన మొదలైంది. అతని స్థానంలో సంజు సామ్సన్ ను రంగంలోకి దిగనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నమీబియాతో జరిగే మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ పాల్గొనడంపై అనుమానాలు మొదలయ్యాయి. ఓనివేదికల ప్రకారం, అభిషేక్ శర్మ అనారోగ్యంతో బాధపడుతున్ను. ఢిల్లీలో టీం ఇండియాతో ప్రాక్టీస్ చేసేందుకు రాలేదు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆటగాళ్లందరూ ప్రాక్టీస్ చేశారు. కానీ అభిషేక్ ఆ గ్రూప్‌లో కనిపించలేదు. అభిషేక్ శర్మ కడుపు సమస్యతో బాధపడుతున్నాడని, అందువల్ల ప్రాక్టీస్ చేయలేకపోతున్నాడని నివేదికలు సూచిస్తున్నాయి. భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్చేట్ కూడా ఈ విషయంపై కీలక అప్డేట్ అందించాడు.

**అభిషేక్ శర్మ ఆడటంపై సందిగ్ధం..?**

ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన టెండెస్కతే, ఇంకా రెండు రోజులు మిగిలి ఉన్నాయని, నమీబియాతో జరిగే మ్యాచ్‌కు అభిషేక్ అందుబాటులో ఉంటాడని ఆశిస్తున్నానని తెలిపాడు. టీం ఇండియా అసిస్టెంట్ కోచ్ ప్రకటన ప్రకారం అభిషేక్ శర్మ ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నాడని, రెండవ మ్యాచ్‌లో అతను పాల్గొనడం సందిగ్ధం నెలకొంది. అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో మొదటి బంతికే ఔటవడం ద్వారా అభిషేక్ శర్మ మొదటి మ్యాచ్‌లో దారుణంగా విఫలమయ్యాడు.

**సంజు సామ్సన్‌కు లక్కీ ఛాన్స్..?**

నమీబియాతో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడకపోతే, సంజు సామ్సన్ తిరిగి ప్లేయింగ్ ఎలెవన్‌లోకి రావొచ్చు. ఈ మ్యాచ్ ఫిబ్రవరి 12న జరుగుతుంది. సంజు, ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించవచ్చు. మొదటి మ్యాచ్‌లో సంజు సామ్సన్‌కు అవకాశం రాలేదు. ఇషాన్ కిషన్ అద్భుతమైన ఫామ్ కారణంగా అతను ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తప్పుకున్నాడు. అయితే, అభిషేక్ లేనప్పుడు సంజూకు అవకాశం లభించవచ్చు.

**బుమ్రా రీఎంట్రీ..**

అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్ కు దూరమైన జస్ప్రీత్ బుమ్రా రెండవ మ్యాచ్ కు తిరిగి రానున్నాడు. ఢిల్లీలో జరిగిన ప్రాక్టీస్ సెషన్ లో ఆటగాడు ఫిట్ గా కనిపించాడు. ప్రశ్న ఏమిటంటే, బుమ్రా ఫిట్ గా ఉంటే సిరాజ్ ను ఆడిస్తారా లేదా అనేది చూడలి. సిరాజ్ మొదటి మ్యాచ్ లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన సంగతి తెలిసిందే. మరి సిరాజ్ ను తప్పించే సాహసం చేస్తారా అనేది చూడాలి. టీం ఇండియాకు మరో శుభవార్త ఏమిటంటే వాషింగ్టన్ సుందర్ జట్టులోకి వచ్చాడు. న్యూజిలాండ్ తో జరిగిన వన్డే సిరీస్ లో ఈ ఆటగాడు సైడ్ స్ట్రెయిన్ తో బాధపడ్డాడు. కానీ ఇప్పుడు పూర్తిగా ఫిట్ గా మారాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైంవాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com